www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్  సంపుటి : 16  సంచిక : 137  గురువారం, అక్టోబర్ 01, 2026, పేజీలు - 12  వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలి
- రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యలు



**హైదరాబాద్,సెప్టెంబర్ 30 :** వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి

మిగతా2లో...

# గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని కూల్చేస్తాం

- సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
- జెండా ఎగురవేసిన మొనగాడికి మంత్రి పదవి
- భవిష్యత్తులో మంత్రివర్గంలోకి తీసుకుంటా..
- గత ప్రభుత్వం సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారు
- సిరిసిల్ల ప్రజల గురించి ఏనాడైనా ఆలోచించిందా..
- తెలంగాణ ఉద్యమం, ప్రజల ఓట్లతో రాజకీయ లబ్ది
- కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడబెట్టుకున్నారు
- సిరిసిల్ల ప్రజాపాలన బహిరంగ సభలో సిఎం రేవంత్
- కేసీఆర్ కుటుంబంపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి ఎన్నిసార్లైనా వెళ్తా..
- కరీంనగర్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కలెక్టరేట్ నూతన భవన సముదాయం ప్రారంభం
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరణ
- అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ శ్రీకారం









## పంటలకు కనీస మద్దతు ధర పెంపు

- 2,610కు చేరిన క్వింటా గోధుములు
- రబీపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం
- కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి
- ఢిల్లీలో ట్రాఫిక్ పరిష్కారానికి చర్యలు
- ఏఐ సాయం తీసుకుంటామని వెల్లడి

# ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ

● ద్వైపాక్షిక సహకారం, వాణిజ్య అంశాలపై చర్చ! ● ప్రపంచ శాంతి భద్రతలపైనా సమాలోచనలు




# అక్టోబర్ 2న యూపీఐ సేవలు పనిచేస్తాయ్!

'నో యూపీఐ డే' నిరసనను విరమణ
నిర్మలా సీతారామన్‌తో వ్యాపారవేత్తల భేటీ



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 :** యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదించిన ఎండీఆర్ ఛార్జీకి వ్యతిరేకంగా అక్టోబర్ 2న చేపట్టాలనుకున్న 'నో యూపీఐ డే' నిరసనను వ్యాపార సంఘాలు విరమించుకున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో బుధవారం జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు

మిగతా2లో...

## అదనపు డిక్లరేషన్ తొలగింపు

- ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ఫారం-6లో కీలక మార్పు చేసిన ఈసీ
- సర్ పూర్తయిన రాష్ట్రాలకు వర్తింపు




# అక్టోబర్ 2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' మార్చ్

● ఈసీపై 'ఇండియా' కూటమి సమరశంఖం.. ● దేశవ్యాప్త ఆందోళనలకు కూటమి పిలుపు ● అక్టోబర్ 6న విపక్ష ఎంపీల ప్రదర్శన.. ● కూటమి ఉద్యమ కార్యాచరణ ఖరారు




**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30:** ఓటరు జాబితా సవరణలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పి ంచనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గే ప్రకటించారు.

మిగతా2లో...

# మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు

● వచ్చే ఎన్నికల్లో సిఎం అభ్యర్థిని నేను కాదు ● కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు ● కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ● బీఆర్ఎస్-బీజేపీ మధ్య పొత్తు ఉండబోదు ● రాష్ట్ర రాజకీయాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు




**హైదరాబాద్,సెప్టెంబర్ 30 :** వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని.. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన తెలంగాణ రాజకీయాలు, బీఆర్ఎస్ భవిష్యత్తు, బీజేపీతో పొత్తు, డీలిమిటేషన్, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై మాట్లాడారు. తాను ప్రధాన రాజకీయ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నందున వచ్చే ఎన్నికల్లో సీఎం అభ్యర్థి మీరేనా అని అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పష్టంగా సమాధానం

మిగతా2లో...

## గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం

- వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష
- అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలి



# గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని కూల్చేస్తాం

**సిరిసిల్ల,సెప్టెంబర్ 30 :** గజ్వేల్ గడీ కూల్చినట్లే ఈసారి సిరిసిల్ల గడీని నేలమట్టం చేద్దామని కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేసీఆర్ కుటుంబంపై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గరుడ పక్షి దెబ్బ కాకి పిల్లకు ఏం తెలుసని ఎద్దేవా చేశారు. అమెరికా హోటళ్లలో ప్లేట్లు కడిగిన వ్యక్తికి తన విలువ ఎలా తెలుస్తుందని ఘాటుగా స్పందించారు. ఫామ్‌హౌస్‌లలో నిద్రపోయిన వారికి తన గురించి బాగా తెలుసని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. గత రెండున్నరేళ్ల పాలనలోనే సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేసిన నాయకుడిని మంత్రివర్గంలోకి తీసుకుంటానని ముఖ్యమంత్రి సంచలన ప్రకటన చేశారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఏమీ చేయకుండా టీవీ ఛానళ్లు, పత్రికలు, ఫామ్‌హౌస్‌లు, స్టార్ హోటళ్లు మాత్రమే సంపాదించుకున్నారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కరీంనగర్ కలెక్టరేట్ భవనాన్ని ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. టెండర్లు వేసి కేవలం కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. చివరకు ఆడబిడ్డలకు ఇచ్చే బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు కొట్టి తిన్నారని తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు 'పుట్టింటి సారె' ద్వారా నాణ్యమైన చీరలను అందిస్తూ సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్‌గా ఉన్న దళిత బిడ్డ గడ్డం ప్రసాద్‌ను 'అధ్యక్షా' అని పిలవాల్సి వస్తుందనే అహంకారంతోనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముందు దళితులు డప్పు కొడితే ఆ స్థలాన్ని పసుపు నీళ్లతో కడిగించారని, ఇది తీవ్రమైన అవమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను బహిష్కరించే వరకు సమాజం వదలదని హెచ్చరించారు. ఎర్రవెల్లి భూ ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావ్ అక్రమ ఆస్తుల లెక్కలు తేలుస్తామని, డెక్కన్ స్టార్ హోటల్స్ తదితర ఆస్తుల వివరాలను అసెంబ్లీలో సమయం చాలక దాచామని, త్వరలోనే పార్ట్-2 పేరుతో ప్రజల ముందు పెడతామని సీఎం స్పష్టం చేశారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే నాయకుడిని కేబినెట్ బెర్త్ కన్ఫార్మ్ అంటూ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం.. ఫిరంగులమై పేలుదాం అంటూ కార్యకర్తల్లో జోష్ నింపేలా వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీ విషయంలో తాము చెప్పినది చేసి చూపించామని.. ఇప్పుడు సిరిసిల్లపై దృష్టి పెట్టామని రేవంత్ రెడ్డి అన్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడికి మంత్రి పదవి ఇస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్‌లో కుటుంబ సభ్యులకు కీలక పదవులు దక్కాయని.. కాంగ్రెస్‌లో మాత్రం పార్టీ కోసం పనిచేసిన సాధారణ కార్యకర్తలు, నాయకులకు కూడా అవకాశాలు లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

# ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం అత్యంత ప్రాధాన్యత కలిగిన ఫోన్ సంభాషణ జరిగింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల అగ్రనేతలు ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా సమీక్షించారు. అధ్యక్షుడు ట్రంప్‌తో ఫలప్రదమైన చర్చలు జరిగాయని ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా అధికారికంగా వెల్లడించారు. భారత్, అమెరికా మధ్య పరస్పర వాణిజ్యం, రక్షణ బలోపేతం, స్వచ్ఛ ఇంధన వనరులు, కీలక అధునాతన సాంకేతిక రంగాలలో సహకారాన్ని మరింత విస్తరించడంపై ఇద్దరు నేతలు దృష్టి సారించారు. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు నడిపించేందుకు పరస్పర సమన్వయంతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. అంతర్జాతీయ వాణిజ్య చర్చలు, ప్రాంతీయ భద్రతా వ్యవహారాలు కొనసాగుతున్న తరుణంలో ఈ ఫోన్ కాల్ చర్చ జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి రేకెత్తించింది. ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన భద్రతా ఒప్పందాల అమలుపై నేతలిద్దరూ సమాలోచనలు జరిపినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. సైనిక రంగంలో పరస్పర భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ఇరు దేశాల రక్షణ పరిశ్రమల అనుసంధానాన్ని వేగవంతం చేయడంపై చర్చించారు. రక్షణ రంగంతో పాటు అత్యాధునిక సాంకేతికతల బదిలీ, కృత్రిమ మేధ, పరిశోధనలలో సంయుక్తంగా అడుగులు వేయడంపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఇంధన రంగంలో దేశ భద్రతను పటిష్టం చేసుకుంటూనే వాణిజ్య విస్తరణకు ఉన్న అవకాశాలను ఇరు దేశాలు సమీక్షించాయి. ప్రపంచ చమురు మార్కెట్ ఒడిదుడుకులు, సహజ వనరుల సరఫరాలో స్థిరత్వాన్ని సాధించేందుకు పరస్పర సహకారం కొనసాగించాలని ఇరు పక్షాలు నిర్ణయించుకున్నాయి. ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా వాణిజ్య సుంకాలు, మార్కెట్ భాగస్వామ్యంపై ఉన్న సవాళ్లను సామరస్యంగా పరిష్కరించుకోవాలని భావించారు. సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని (కాంప్రిహెన్సివ్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్) నూతన శిఖరాలకు చేర్చేందుకు నిరంతర సంప్రదింపులు కొనసాగించాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. ప్రపంచ శాంతి, ప్రాంతీయ సుస్థిరత కోసం ఇరు దేశాల బలమైన మైత్రి ఎంతో కీలకమని నేతలు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ, పారిశ్రామిక స్థాయిలలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# పంటలకు కనీస మద్దతు ధర పెంపు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 :** కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా రబీ పంటలకు సంబంధించి 2027-28 సీజన్‌కు మద్దతు ధరను నిర్ణయించింది. గోధుమలు, బార్లీ (జౌ), శనగలు, ఆవాలు, పొద్దుతిరుగుడు (కుసుమ), మసూర్ (కందులు/చిరుధాన్యాల రకం) పంటల కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గోధుమలపై క్వింటాలుకు రూ.25 పెంచారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరలో అత్యధికంగా కుసుమ పంటకు క్వింటాలుకు 675 చొప్పున పెంపుదల చేశారు. ఆ తర్వాత రేప్‌సీడ్, ఆవాలకు క్వింటాలుకు 413 చొప్పున పెంచారు. మసూర్ పంటకు క్వింటాలుకు 390, బార్లీకి (జౌ) క్వింటాలుకు 136, శనగలకు క్వింటాలుకు 83, గోధుమలకు క్వింటాలుకు 25 చొప్పున పెంచారు.

ఢిల్లీ ట్రాఫిక్ నిర్వహణను మెరుగు చేయడం కోసం 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' తీసుకురావాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 1,529 ట్రాఫిక్ సిగ్నల్స్ స్థిరమైన మ్యాన్యువల్ పద్ధతిలో ఉన్నాయి.

అయితే 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వచ్చిన తర్వాత ఈ సిగ్నల్స్ ట్రాఫిక్ రద్దీకి తగ్గట్లుగా సిగ్నల్ సమయాన్ని అవే అడ్జస్ట్ చేసుకుంటాయి. దీనిని మూడు విడతలలో (ఫేజ్‌లలో) అమలు చేయనున్నామని తెలిపారు. వేర్వేరు కారిడార్లలో వేర్వేరు సమయాల్లో ఈ పద్ధతిని అమలు చేస్తారు. ఇందుకోసం కేంద్రం 1,790 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుందని తెలిపారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌తో కలిపి రెన్యూవబుల్ ఎనర్జీ సరఫరా చేయడం కోసం 1.86 లక్షల కోట్ల అంచనాతో కూడిన 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్ 111' పథకానికి కూడా మోదీ కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో శాస్త్రీయ పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 'పీఎం ధార' పథకాన్ని తీసుకొచ్చింది. రూ. 1,86,405 కోట్లను ఈ పథకానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక, నూనె గింజల విషయానికొస్తే ఆవాల మద్దతు ధర క్వింటాలుకు రూ. 6,200 నుంచి రూ. 413 పెరిగి రూ. 6,613కి చేరిందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# అదనపు డిక్లరేషన్ తొలగింపు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) వివాదం కొనసాగుతున్న వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే వారికి సంబంధించిన ఫారం-6లో కీలక మార్పు చేసింది. సర్ ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఫారం-6తో పాటు జత చేసిన అదనపు సర్ డిక్లరేషన్‌ను తొలగించింది. అదనపు నిబంధన కేవలం సవరణ ప్రక్రియ జరిగే సమయంలో మాత్రమే వర్తిస్తుందని, సర్ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో మాత్రం వర్తించదని తెలిపింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో కూడిన పూర్తిస్థాయి కమిషన్ ఈనెల 26న సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈసీ నిర్ణయం ప్రకారం, సర్ ప్రక్రియ పూర్తయిన ప్రాంతాల్లో కొత్త ఓటర్లు ఇకపై ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్దేశించిన సాధారణ ఫారం-6ను మాత్రమే పూర్తి చేయాల్సి ఉంటుంది. సర్ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం అదనపు డిక్లరేషన్ అందుబాటులో ఉంది. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే దరఖాస్తుదారులు తాము లేదా తమ తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలు గతంలో జరిగిన ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితాల్లో ఉన్నారనే వివరాలను అందించాల్సి ఉంటుంది. ఈ అదనపు ప్రకటనను సర్ ప్రక్రియలో భాగంగానే ఎన్నికల సంఘం తీసుకొచ్చింది. అయితే సవరణ పూర్తయిన ప్రాంతాల్లో దాని అవసరం ఉండదని స్పష్టం చేస్తూ తాజాగా ఆప్షన్‌ను తొలగించింది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్‌ను ఈసీఐనెట్ యాప్, పోర్టల్ నుంచి తొలగించారు. సంబంధిత రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) వెబ్‌సైట్లలోనూ ఇదే మార్పు చేశారు. ఇక ఆయా రాష్ట్రాల్లో ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే పౌరులు రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారం-6లో అవసరమైన వివరాలను మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఫారం- 6కు జత చేసిన అదనపు డిక్లరేషన్ కేవలం సర్ ప్రక్రియ కోసమేనని అందులో ఈసీ పేర్కొంది. సర్ అమలు లేని సమయంలో రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం వర్తించే సాధారణ ఫారమ్‌లనే ఉపయోగిస్తామని స్పష్టం చేసింది. దీంతో సర్ పూర్తయిన ప్రాంతాల్లో సాధారణ ఫారం-6 ప్రక్రియకు తిరిగి వెళ్లేలా ఆన్‌లైన్ వ్యవస్థలో మార్పులు చేశారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన చట్టబద్ధ ప్రక్రియలో అదనపు సర్ వివరాలను అడగడం ఇకపై ఉండదు. ఫారం-6కు సంబంధించిన మార్పులపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు రావటం ఇటీవల వివాదాస్పదంగా మారింది. ఫారం-6లో చేసిన మార్పుల అంశం గతంలో ఎన్నికల సంఘంలోనే చర్చనీయాంశమైంది. ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకునేందుకు అర్హులైన భారతీయ పౌరులు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారమ్‌గానే ఫారం-6ను రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 నిర్దేశిస్తుంది. ఈ ఫారమ్‌లో మార్పులు చేయడంపై ఎన్నికల కమిషనర్ వివేక్ జోషి,సుఖ్‌బీర్ సింగ్ సంధు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. నిబంధనల ద్వారా నిర్దేశించిన ఫారమ్‌ను సంబంధిత నిబంధనలను సవరించకుండా మార్చలేదని, అలాగే ఈసీఐనెట్‌లో ఫారం-6 దరఖాస్తు ప్రక్రియకు సర్‌కు సంబంధించిన అదనపు డిక్లరేషన్‌ను జత చేయడంపైనా సంధు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం

**హైదరాబాద్,సెప్టెంబర్ 30 :** వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారు లతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకుల నుంచి క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. **పనుల ఎంపికలో గ్రామసభలదే కీలక పాత్ర** అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సీతక్క ఆదేశించారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామపంచాయతీల పాత్ర, బాధ్యతలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. **పారదర్శకత, నాణ్యతకు పెద్దపీట** ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనాన్ని పాటించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమ స్యలను వెంటనే పరిష్కరించేందుకు మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచే యాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి అందేలా వీబీ జీ రామ్ జీ అమలును మరింత పటిష్ఠం చేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 2న యూపీఐ సేవలు పనిచేస్తాయ్!

(మొదటి పేజీ తరువాయి)

20 మంది వ్యాపార ప్రతినిధులు నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రూ.2,000కు మించిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఫీజు విధించే ప్రతిపాదనపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఛార్జీతో చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై భారం పెరుగుతుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని చెప్పారు. చాందినీ చౌక్ ఎంపీ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ నేతృత్వంలో ఈ ప్రతినిధి బృందం సమావేశమైంది. ప్రతిపాదిత ఛార్జీపై స్పష్టత ఇవ్వాలని కోరింది. వ్యాపారుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సమావేశం తర్వాత ఖండేల్‌వాల్ మాట్లాడుతూ.. కేంద్రంతో చర్చలు సానుకూలంగా జరిగాయని తెలిపారు. వ్యాపారులు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్న భరోసా లభించిందన్నారు.

దీంతో అక్టోబర్ 2న తలపెట్టిన నిరసనను ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ తొలుత 'నో యూపీఐ డే'కు పిలుపునిచ్చాయి. అయితే కేంద్రంతో చర్చల తర్వాత ఆ పిలుపును వెనక్కి తీసుకున్నాయి. ఇదిలా ఉండగా.. రూ.2,000కు మించిన అర్హత ఉన్న మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఫీజు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. మరోవైపు యూపీఐపై జీఎస్టీ భారం పెరుగుతుందన్న వార్తలను ఎన్‌పీసీఐ గతంలో ఖండించింది. రూ.2,000 వరకు జరిగే లావాదేవీలకు జీరో ఎండీఆర్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం యూపీఐ వ్యాపార లావాదేవీల్లో 96 శాతానికి పైగా రూ.2,000లోపే ఉన్నాయి.

# అక్టోబర్ 2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' మార్చ్

(మొదటి పేజీ తరువాయి)

వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు 'ఓట్ బందీ' ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈవీఎంలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే సర్ కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండియా బ్లాక్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారు. ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరనున్నారు. అక్టోబర్ రెండోవారంలో మేము వారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించనున్నాం. ప్రభుత్వం సృష్టిస్తున్న రాజ్యాంగపరమైన అడ్డంకులను, మాకున్న ఇబ్బందులను రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజలను ఇబ్బంది పెడుతూ వ్యవసథలను నాశనం చేస్తూ వారి సొంత నిర్ణయాలతో నేడు ఈ దొంగల ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాష్ట్రపతికి తెలియజేయాలనుకుంటున్నాం. ఈ విషయంలో మేం ఎంతవరకు విజయం సాధిస్తామనేది తర్వాత చూస్తాం. అక్టోబర్- నవంబర్ నెలల్లో ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించిన వేదికలు, తేదీలు త్వరలో ఖరారు చేస్తాం. నవంబర్ 1న ఢిల్లీలో ఒక ప్రధాన ర్యాలీని నిర్వహిస్తామని మల్లిఖార్జున ఖర్గే తెలిపారు. ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేన-యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.

# జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని చెప్పారు. 2 ఏళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయిందని చెబుతూ.. ప్రస్తుతం ప్రజలు గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ముఖ్యంగా కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ అనే 3 పదాలను కేటీఆర్ ఉపయోగించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు పునరాలోచన చేస్తున్నారని.. పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారని.. భవిష్యత్తులో తిరుగుబాటు వస్తుందని ఆయన తన రాజకీయ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పార్టీల సిద్ధాంతాలు పరస్పరం పూర్తిగా భిన్నంగా ఉన్నాయని.. తాము బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ 26 ఏళ్ల చరిత్రలో బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చినప్పటికీ పార్టీ సిద్ధాంతంలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. పార్టీ డీఎన్ఏ మారలేదని.. అందువల్ల సిద్ధాంతం కూడా మారలేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేసిన కేటీఆర్.. తమ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే సమయంలో గత పరాజయం కంటే పెద్ద స్థాయిలో పునరాగమనం ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల డీలిమిటేషన్ అంశంపైనా కేటీఆర్ తన అభిప్రాయాలను వెల్లడించారు. లోక్‌సభ స్థానాలను పెంచడంపై మాత్రమే ఎందుకు దృష్టి పెట్టాలని ప్రశ్నించిన ఆయన.. ప్రజలకు ఎమ్మెల్యేలే తొలి స్థాయి ప్రజాప్రతినిధులుగా ఉంటారని అన్నారు. జనాభా నియంత్రణ చర్యలను అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం విషయంలో అన్యాయం జరగకూడదన్న ఆందోళనను కేటీఆర్ వ్యక్తం చేశారు. పార్లమెంట్ స్థానాల సంఖ్యను ప్రస్తుత స్థాయిలో కొనసాగించడంతో పాటు, ప్రాతినిధ్యం విషయంలో అనుపాత విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవసరాన్ని పూర్తిగా వ్యతిరేకించడం లేదని కేటీఆర్ చెప్పారు.

# సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనకు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ నాగిరెడ్డి, తూము వేణు వినతి

**-- భరత్ నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి**



**బాలానగర్ అక్టోబర్ 01 ( పీపుల్స్ న్యూస్)**
కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్ నగర్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి, తూము వేణు బుధవారం ఉదయం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీమతి సృజనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న రహదారులు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల, తాగునీటి సరఫరా, ట్రాఫిక్ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా స్థానిక కాలనీల్లోని ఇరుకైన రహదారులు, హెచ్‌పీ రోడ్డుతో పాటు ప్రధాన రహదారులపై వర్షపు నీరు, మురుగునీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వర్షపు నీరు, మురుగునీరు సక్రమంగా వెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు రహదారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గతంలో కమిషనర్ భరత్ నగర్ కాలనీలో నిర్వహించిన 'ఒక రోజు -- ఒక వార్డు' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కాలనీలో అంతర్గత రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, తాగునీటి సరఫరా మెరుగుదల, ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు మరమ్మతులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా భరత్ నగర్ కాలనీ నుంచి ఎంఎంటీఎస్, మెట్రో రైల్వే స్టేషన్లకు వెళ్లే మార్గాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని తెలిపారు. ఈ రద్దీ కారణంగా స్థానిక ప్రజలతో పాటు పాఠశాల విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని, భరత్ నగర్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ఈ సమస్యలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని, ప్రాధాన్యత క్రమంలో పరిష్కార చర్యలు చేపట్టి కాలనీల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ నాయకులు కమిషనర్‌ను కోరారు.

# బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ శేషాద్రిణి రెడ్డి

**బాలానగర్ అక్టోబర్ 01 ( పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం ఐపీఎస్ డీసీపీ--2 ఎస్. శేషాద్రిణి రెడ్డి, బుధవారం బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడి నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, వారి విధులు, బాధ్యతలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను స్పష్టంగా



తెలుసుకుని, సమన్వయంతో విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా డీసీపీ సూచించారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడటం, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.అలాగే పోలీస్ స్టేష న్‌లోని వివిధ రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణ, రికార్డుల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని ఆదేశి ంచారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణలో క్రమశిక్షణ, సమయపాలన, సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలని డీసీపీ శేషాద్రిణి రెడ్డి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

# నార్మల్ మదర్ డెయిరీ డైరెక్టర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకుడు దొంతిరి సోమిరెడ్డి అధిక మెజారిటీతో ఘన విజయం సాధించారు.



**బాలానగర్ అక్టోబర్ 01 ( పీపుల్స్ న్యూస్)**
నల్లగొండ--రంగారెడ్డి జిల్లా నార్మల్ మదర్ డెయిరీ డైరెక్టర్ ఎన్నికల్లో బాలానగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు దొంతిరి సోమిరెడ్డి అధిక మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఈ విజయంతో బాలానగర్ ప్రాంతానికి చెందిన నాయకుడికి జిల్లా స్థాయి పాల ఉత్పత్తిదారుల సహకార రంగంలో కీలక బాధ్యత దక్కడం పట్ల స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా కూకట్‌పల్లి శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావు, బాలానగర్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి దొంతిరి సోమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో అధిక మెజారిటీతో విజయం సాధించడం ఆయనపై ఉన్న నమ్మకానికి, ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణకు నిదర్శనమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. నార్మల్ మదర్ డెయిరీ అభివృద్ధితో పాటు పాడి రైతుల సంక్షేమం, పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సేవలు అందించడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో నూతన డైరెక్టర్‌గా దొంతిరి సోమిరెడ్డి కీలక పాత్ర పోషించాలని వారు ఆకాంక్షించారు. తనకు లభించిన ఈ విజయాన్ని బాధ్యతగా స్వీకరించి, రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మహమ్మద్ ఖాజా, అశోక్ రెడ్డి, శాంత కుమార్ రెడ్డి తదితరులు పాల్గొని దొంతిరి సోమిరెడ్డిని అభినందించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి, బాలానగర్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ప్రపంచ వేదికపై మెరిసిన బాలానగర్ కు చెందిన బిడ్డ.. మెహరున్నిసా బేగంకు ఘన సన్మానం .



**బాలానగర్ అక్టోబర్ 01 ( పీపుల్స్ న్యూస్)**
ప్రపంచ నైపుణ్య పోటీల్లో భారత్ తరపున పాల్గొని వెండి పతకం సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, బాలానగర్ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచిన మెహరున్నిసా బేగంను బాలానగర్ ప్రాంత నాయకులు, మేధావులు ఘనంగా సన్మానించారు. ప్రపంచస్థాయిలో ప్రతిభ చాటుకుని అంతర్జాతీయ వేదికపై భారత కీర్తిపతాకాన్ని రెపరెపలాడించిన ఆమె విజయాన్ని అభినందిస్తూ పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్‌కు చెందిన మహమ్మద్ జావిద్ కుమార్తె మెహరున్నిసా బేగం, సెప్టెంబర్ 22 నుంచి 27 వరకు చైనాలోని షాంఘైలో నిర్వహించిన 48వ ప్రపంచ నైపుణ్య పోటీలు (వరల్డ్‌స్కిల్స్ షాంఘై--2026)లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి లాజిస్టిక్స్ అండ్ ఫ్రైట్ ఫార్వర్డింగ్ విభాగంలో వెండి పతకం సాధించారు. సుమారు 70 దేశాలు, ప్రాంతాలకు చెందిన 1,400 మంది యువ నైపుణ్య పోటీదారులు 64 విభాగాల్లో పాల్గొన్న ఈ అంతర్జాతీయ పోటీల్లో ఆమె అసాధారణ ప్రతిభ కనబరిచి పతకాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఆయా విభాగాల్లో ప్రతిభ చాటిన మెహరున్నిసా బేగం ప్రపంచస్థాయిలో పతకం సాధించడం పట్ల బాలానగర్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు, విజయాలకు అడ్డంకులు కావని మెహరున్నిసా బేగం తన విజయంతో నిరూపించారని కొనియాడారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బేకరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆమె తండ్రి మహమ్మద్ జావిద్, తన కుమార్తె ప్రతిభను ప్రోత్సహించి దేశం గర్వించే స్థాయికి తీసుకెళ్లడం అభినందనీయమని ప్రశంసించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పట్టుదల, కృషి ఉంటే యువతులు ప్రపంచస్థాయిలోనూ రాణించగలరని ఆమె విజయం చాటిచెప్పిందన్నారు. మెహరున్నిసా బేగం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని బాలానగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని బాలికలు, యువతులు తమలోని నైపుణ్యాలను గుర్తించి వివిధ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రతిభావంతులైన పేద యువతకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎల్.ఎస్.రావు, సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్, ఎంఐఎం నాయకుడు మహంకాళి శంకర్, కాంగ్రెస్ పార్టీ బాలానగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మధు గౌడ్, సమంత్ గౌడ్, అక్రం, గోవర్ధన్ రెడ్డి, దివాకర్ తదితరులు పాల్గొని మెహరున్నిసా బేగంకు అభినందనలు తెలిపారు.

# ఎస్సీ డిపార్ట్‌మెంట్ డివిజన్ చైర్మన్‌లకు నియామక పత్రాలు





**జవహర్ నగర్ సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**
మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని ఎస్సీ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి 16 డివిజన్లకు నియమితులైన చైర్మన్‌లకు బుధవారం నియామక పత్రాలను అందజేశారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, టీపీసీసీ రాష్ట్ర వైస్ చైర్మన్, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గడ్డం శ్రీనివాస్, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ కావలి చంద్రయ్య నియమిత చైర్మన్‌లకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.నూతనంగా నియమితులైన డివిజన్ చైర్మన్‌లకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై కస్తూర్బా బాలికలకు అవగాహన












**వెంకటాపూర్, ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**
వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం సైబర్ క్రైమ్, డ్రగ్స్, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ములుగు డీఎస్పీ, ములుగు సీఐ హాజరై విద్యార్థినులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. అలాగే డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే తీవ్ర పరిణామాలను వివరించారు. బాలికల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టంపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, వెంకటాపూర్ ఎస్సై తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. విద్యార్థుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నివారణపై ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# టి యు డబ్ల్యూ జే (ఐజేయు) లో ముసలం..?

●యూనియన్ జిల్లా అధ్యక్షుడిపై మొదలైన తిరుగుబాటు

●రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎనగందుల కొమురయ్య రాజీనామా

●అదే బాటలో జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్

●త్వరలో మరికొంతమంది రాజీనామాకు సిద్ధమైనట్లు సమాచారం





**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 30( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టి యు డబ్ల్యూ జే-ఐజేయు) ములుగు లో ప్రకంపనలు మొదలయ్యాయి. జిల్లా అధ్యక్షుడి ఒంటెద్దు పోకడలు, అనుసరిస్తున్న విధివిధానాలు నచ్చకపోవడంతో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎనగందుల కొమురయ్య తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన బాటలోనే జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్ కూడా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఐజేయు ములుగు జిల్లా అధ్యక్షుడు యూనియన్ కార్యక్రమాలను ఇతర యూనియన్ సభ్యులతో కలిసి నిర్వహిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. సొంత సంఘం సభ్యులను పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న తీరు నచ్చకనే స్వచ్ఛందంగా తప్పుకుంటున్నట్లు వారు తెలిపారు. త్వరలో ఏ సంఘంలో చేరబోయేది ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లా నుంచి మరికొంతమంది సభ్యులు కూడా టి జె డబ్ల్యూ జె (ఐజేయు) కు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలో వారు కూడా రాజీనామాలు ప్రకటిస్తారని వెల్లడించారు. ఈ మేరకు ఐ జె యూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడికి, జనరల్ సెక్రెటరీకి మెయిల్ ద్వారా తమ రాజీనామా లేఖలను పంపించినట్లు వారు తెలిపారు. ఒక్కసారిగా ఇద్దరు కీలక నేతలు రాజీనామా చేయడంతో ములుగు జిల్లా జర్నలిస్టు వర్గాల్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

# రూ.75 వేల లంచం.. ఏసీబీ వలకు మోయినాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి

●సీనియర్ అసిస్టెంట్‌తో కలిసి పట్టుబడిన టౌన్ ప్లానింగ్ అధికారి



**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**
మోయినాబాద్ మున్సిపాలిటీలో రూ.75 వేల లంచం తీసుకుంటూ టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణి, సీనియర్ అసిస్టెంట్ యెలమోని సుదర్శన్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ సిటీ రేంజ్-2 అధికారులు బుధవారం నిర్వహించిన ట్రాప్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీబీ వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి నిర్మాణాన్ని అక్రమ నిర్మాణంగా పరిగణించి ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా అధికారికంగా అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.75 వేల లంచం డిమాండ్ చేసినట్లు పేర్కొంది. టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణి సూచన మేరకు మోయినాబాద్ గ్రామపంచాయతీ మాజీ కార్యదర్శి, ప్రస్తుతం మున్సిపాలిటీలో డిప్యుటేషన్‌పై సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యెలమోని సుదర్శన్ ద్వారా లంచం స్వీకరించినట్లు తెలిపింది. సుదర్శన్ వద్ద నుంచి అతని సూచన మేరకు రూ.75 వేల లంచం మొత్తాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. విధుల ను సక్రమంగా నిర్వహించకుండా అనుచిత ప్రయోజనం పొం దేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ పేర్కొంది. ఇద్దరు నిందితులను నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచి న్యాయపరమైన రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదు దారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా వెల్లడించలేదని పేర్కొంది. లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదుఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ కోరింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపింది.

# పదవీ విరమణ పొందిన నలుగురు పోలీస్ అధికారులకు ఘన వీడ్కోలు

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో వీడ్కోలు కార్యక్రమం









**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన నలుగురు పోలీస్ అధికారులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన అధికారులు తమ సుదీర్ఘ సేవా కాలంలో పోలీస్ శాఖకు, ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సేవ, నేర నియంత్రణతో పాటు శాఖ అభివృద్ధికి వారు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. తమ అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని సూచించారు.

**పదవీ విరమణ పొందిన అధికారులు**

ఎ. ముత్యంరెడ్డి -- డీసీపీ, క్రైమ్స్ అండ్ ఈఓడబ్ల్యూ

ఎ. దామోదర్ -- ఎస్ఐ-181, స్పెషల్ బ్రాంచ్

పి. బాలరాజ్ -- ఎస్ఐ-1615, మాదాపూర్ పోలీస్‌స్టేషన్

పి. ఆంజనేయులు -- ఏఆర్ఎస్ఐ-1917, కార్ హెడ్‌క్వార్టర్స్, సైబరాబాద్

ఈ సందర్భంగా డీసీపీ ఎ. ముత్యంరెడ్డికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తరఫున అవార్డు ప్రదానం చేశారు. పలువురు పోలీస్ అధికారులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) టి. అన్నపూర్ణ, డీసీపీ కుత్బుల్లాపూర్ ఎన్. కోటి రెడ్డి, డీసీపీ కూకట్‌పల్లి రితిరాజ్, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర, మహిళా--శిశు భద్రత విభాగం డీసీపీ సృజన కర్ణం, సైబర్ క్రైమ్ డీసీపీ కె. పుష్ప, కార్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీఏఓ (అకౌంట్స్) వెంకట్ రెడ్డి, ఏఓ (అడ్మిన్) వై.వి.ఎస్. జ్యోతి ర్మణి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమాకర్, కో-ఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి ఎస్ఐ జి. మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. ఇతర డీసీపీలు, ఏసీపీలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.



## ఈ-కేవైసీ పూర్తి చేసిన వారికే రాయితీపై వంట గ్యాస్ - రేపటి నుంచి కొత్త రూల్స్



**హైదరాబాద్**: రాయితీపై ఎల్పీజీ సిలిండర్ పొందుతున్నారా? ఇంకా ఈ-కేవైసీ చేయించుకోలేదా? మరింత ఆలస్యం చేశారో నష్టపోతారు. ఎందుకంటే ఈ-కేవైసీ చేయించని వంట గ్యాస్ వినియోగదారులకు రాయితీ పథకం నిలిపేయాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకోబోతుంది. ఈ నెల 30వ తేదీ లోగా ఈ-కేవైసీ చేసుకున్న గ్యాస్ వినియోగదారులకు మాత్రమే రాయితీ పథకం వర్తించేయాలని ఆలోచిస్తోంది. ఈ-కేవైసీ చేయించుకుంటే మాత్రం ఏం ఇబ్బంది ఉండదు. అలాగే, 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ రూ.994 లకే లభిస్తుంది. వివిధ కారణాల రీత్యా ఈ-కేవైసీ చేయించుకోని కస్టమర్లకు మాత్రం 5 కిలోల సిలిండర్ రూ.860 , 10 కిలోల సిలిండర్ రూ.1760 ధరల చొప్పున విక్రయించందుకు రంగం సిద్ధమవుతోంది. డబ్బులు భారీగా చెల్లించాలిఅంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ రంగ పెట్రోలియం సంస్థలు అధ్యయనం ద్వారా రూపొందించిన విధి విధానాలు అక్టోబరు 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు మోదీ సర్కారు సమాయత్తమవుతోంది. పైగా నాన్ ఈ-కేవైసీ వినియోగదారులకు పెద్ద సిలిండర్లు అంటే గతంలో లాగా 14.2 కిలోల సిలిండర్లు ఇవ్వకూడదని, 5 నుంచి 10 కిలోల చిన్న సిలిండర్లు సరఫరా చేయాలని యోచిస్తున్న ఆ సంస్థలు ఇప్పటికే డిస్ట్రిబ్యూటర్లకు మౌఖికంగా సమాచారం ఇచ్చినట్లు వినిపిస్తోంది. ప్రత్యేకించి చిన్న సిలిండర్ల కోసం నాన్ ఈ-కేవైసీ వినియోగదారులు భారీగా డబ్బులు చెల్లించాల్సి వస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ-కేవైసీ చేయించుకోకపోతే నష్టపోతారురాష్ట్రవ్యాప్తంగా 1.50 కోట్లు పైగా గృహ వినియోగ వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 93 శాతం ఎల్పీజీ కనెక్షన్లు సంబంధించి వినియోగదారుల ఈ-కేవైసీ పూర్తైంది. మిగతా 7 శాతం అంటే 10.5 లక్షల మంది పైగా ఇంకా ఈ-కేవైసీ పూర్తి కాకపోవడడంతో పెండింగ్ ఉన్నట్లైంది. ఈ-కేవైసీ చేసుకున్న వినియోగదారులు మాత్రమే ఇక నుంచి రాయితీ పథకం కింద వంట గ్యాస్ సిలిండర్ పొందడానికి అర్హులు. డిస్ట్రిబ్యూటర్లు ఇప్పటికే తమ సిబ్బందిని ఇంటింటికీ పంపించి కూడా ఆధార్ బయోమెట్రిక్, ఎలక్ట్రానిక్ అథెంటికేషన్ పూర్తి చేయిస్తున్నాయి. విధిగా ఈ-కేవైసీ చేయించుకోకపోతే నష్టపోతారని పలువురు గ్యాస్ ఏజెన్సీల డిస్ట్రిబ్యూటర్లు సూచించారు."ఈ-కేవైసీ చాలావరకు అయిపోయింది. మిగిలినవారికి కూడా మేమే ఈ-కేవైసీ చేస్తున్నాం. వృద్ధులవి పెండింగ్?లో ఉన్నాయి. వారికి వేలిముద్రలు పనిచేయడం లేదు. కానీ వారికి గ్యాస్ అవసరం ఉంది. అధికారులు, ప్రభుత్వం అటువంటి వారి గురించి ఆలోచించి ఓ నిర్ణయం తీసుకోవాలి. ఈ సమస్య ఉన్న వారికి వెసులుబాటు కల్పించాలి" - గ్యాస్ ఏజెన్సీ అధికారులుఇప్పటి వరకు ఈ-కేవైసీ చేయించుకోలేదా? అయితే తక్షణమే ఈ ప్రక్రియ ఫాలో అవ్వండి. రాయితీ గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరిట ఉండే ఆ వ్యక్తి సంబంధిత ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళితే ఆధార్ అనుగుణంగా మొబైల్ నంబరు నమోదు చేసుకుని ఏజెన్సీలో వేలి ముద్రలు తీసుకుంటారు. లేదా కనుపాపలు స్కాన్ చేస్తారు. నిమిషం వ్యవధిలో పూర్తయ్యే బయోమెట్రిక్ కోసం వినియోగదారులు సహకరించాలని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు విజ్ఞప్తి చేశారు

## కురవని వానలు, నిండని జలాశయాలు - నిరాశ మిగిల్చిన 'నైరుతి'



: రాష్ట్రంలో ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు నిరాశనే మిగిల్చాయి. ఈ ఏడాది ఆలస్యంగా జూన్? పదో తేదీ తర్వాత రాష్ట్రంలోకి ప్రవేశించాయి. కానీ ఎల్‌నినో ప్రభావంతో మేఘాలు తేలిపోయాయి. తెలంగాణలో సాధారణ వర్షపాతం 728.3 మి.మీ. కాగా కేవలం 601.8 మి.మీ. మాత్రమే కురిసింది. దీంతో సుమారు 17% లోటు వర్షపాతం నమోదైంది. కీలకమైన జూన్, జులై నెలల్లో వానలు పూర్తిగా మొహం చాటేశాయి. తర్వాత ఆగస్టు, సెప్టెంబరులో కొంత ఫర్వాలేదు అనిపించినప్పటికీ వానకు, వానకు మధ్య అంతరాయం పెరగడంతో కురిసిన చినుకులు పంట అవసరాలకు మిగలకుండా పోయాయి. చెరువులపై ఆధారపడి చేస్తున్న సాగు భూములు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులు నిండకపోవడంతో ఈ సంవత్సరం సాగునీటి విడుదల చేయలేదు. పంట సాగులో జాప్యంఈ సంవత్సరం వానలు ఆలస్యం కావడం, వర్షాల మధ్య అంతరాల కారణంగా పంట సాగులో రైతులు భిన్నమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొన్నారు. తెలంగాణలోని అనేక జిల్లాల్లోని రైతులు నారు పోసి సుమారు నెలకు పైగా వేచి చూశారు. కొన్నిచోట్ల రెండు, మూడుసార్లు నార్లు పోసుకున్నారు. అనేక మందికి ఆశించిన ఫలితాలు రాలేదు. అయితే ఆరుతడి పంటలు సాగు చేసుకున్న రైతులు మాత్రం కొంతమేర ఒడ్డున పడ్డారు. రాష్ట్రంలో జలాశయాల పరిస్థితి ఇలాఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గోదావరి, కృష్ణ బేసిన్లలోని ప్రాజెక్టులు అరకొరగా నిండాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని చెరువులు, జలాశయాల నిల్వ సామర్థ్యం 1059.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 532.91 టీఎంసీలు అంటే 49.46% మాత్రమే ఉన్నాయని స్పష్టమవుతోంది. మరోవైపు చెరువులు వట్టిపోయాయి. రాష్ట్రంలోని మొత్తం చెరువుల సామర్థ్యం 253.8 టీఎంసీలు కాగా నిల్వ సామర్థ్యానికి 94.3 టీఎంసీలు (37.16%) మాత్రమే నిల్వలున్నాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని 6,477 చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. 6,467 చెరువుల్లో 0% నుంచి 25% వరకు నీరుండగా, 4733 చెరువుల్లో కేవలం 25 నుంచి 50% మేర నీరుంది. వర్షం కురిసింది కేవలం 61 రోజులేవర్షాకాలంలో జూన్ నుంచి సెప్టెంబరు 29 వరకు 121 రోజుల్లో రాష్ట్రంలో సగటున వర్షం కురిసింది కేవలం 61 రోజులే. అయితే తెలంగాణలోని 33 జిల్లాలకు గాను 18 జిల్లాలలో తీవ్రమైన లోటు వర్షపాతం నమోదైంది. అతి తక్కువగా జోగులాంబ గద్వాల జిల్లాలో 22 రోజులు మాత్రమే వర్షాలు కురిశాయి. ఇక్కడ 40% లోటు నమోదైంది. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. 327 మండలాల్లో డ్రైస్పెల్స్‌వానకు, వానకు మధ్య అంతరాన్ని డ్రైస్పెల్ అంటారు. కనిష్ఠంగా మూడు నుంచి నాలుగు వారాల పాటు వర్షపాతం నమోదు కాకపోతే ఒక డ్రైస్పెల్‌గా చెప్పవచ్చు. రాష్ట్రంలో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలోని 16 మండలాలకు 16 డ్రైస్పెల్స్ నమోదయ్యాయి. పది ప్రాంతాల్లో ఒక్కో డ్రైస్పెల్? నమోదైంది. ఆరు మండలాల్లో రెండేసి నమోదయ్యాయి. ఈ తరహాలోనే ఖమ్మంలో 21 మండలాలకు 17 మండలాల్లో, ఆదిలాబాద్‌లో 21 మండలాలకు 16 , వనపర్తిలో 15 మండలాలకు 11, నారాయణపేటలో 13 మండలాలకు 10 మండలాల్లో డ్రైస్పెల్స్ నమోదయ్యాయి. అయితే అత్యధికంగా వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్?నగర్? జిల్లాల్లో ఒక్కొక్క మండలంలో నాలుగు చొప్పున డ్రైస్పెల్స్? నమోదయ్యాయి.

# రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో వీరమాచనేని రామకృష్ణ (VRK), ఆయన సహచరులపై క్రిమినల్ కేసు నమోదైంది.

**వీఆర్కే మరియు ఆయన సహచరులపై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

**సైబరాబాద్:**
షేక్‌పేట్‌లోని 'వీఆర్కే హెల్త్ కేర్ సెంటర్' కి చెందిన వీరమాచనేని రామకృష్ణ , డాక్టర్ కోటేశ్వరరావు మరియు ఇతర ప్రతినిధులపై రాయదుర్గం పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు. టైప్-1 దయాబెటిస్‌ను పూర్తిగా నయం చేస్తామని నమ్మబలికి, ఇన్సులిన్ వాడటం ఆపివేసి "వీఆర్కే డైట్" అనుసరించాలని సూచించినట్లు టైప్-1 దయాబెటిస్ బాధితుడైన శ్రీ కల్లెడ సాయికృష్ణ (30) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్సులిన్ ఆపివేసి డైట్ ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే తన ఆరోగ్యం క్షీణించిందని, 14.09.2026న సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేరగా వైద్యులు 'డయాబెటిక్ కీటో అసిడోసిస్'గా నిర్ధారించారని ఆయన పేర్కొన్నారు. అలాగే డైట్ సేవలు, సప్లిమెంట్ల కోసం సుమారు 26,000 చెల్లించినట్లు బాధితుడు తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు భారతీయ న్యాయ సంహిత , నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం, మరియు డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.
సంస్థ ప్రతినిధుల అర్హతలు, పాత్ర, చట్టబద్ధమైన అనుమతులు, ప్రకటనలు, ఆర్థిక లావాదేవీలు మరియు వారు అందించిన సప్లిమెంట్లను పోలీసులు సమగ్రంగా పరిశీలిస్తున్నారు. వైద్యపరమైన నిర్లక్ష్యం లేదా కారణాలను స్పష్టం చేయడానికి బాధితుడి మెడికల్ రికార్డులను ప్రభుత్వ వైద్య నిపుణుల కమిటీకి పంపనున్నట్లు వెల్లడించారు.కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# కొల్లాపూర్ కేజీబీవీని సందర్శించిన ఆర్జేడీ సోమిరెడ్డి



**కొల్లాపూర్ :** కొల్లాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఆర్జేడీ శ్రీ సోమిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి, వారి ప్రగతిపై ఆరా తీశారు. పాఠశాలలో గ్రంథాలయ ఆవశ్యకతను వివరించిన ఆయన.. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.తన స్వంత నిధులతో కేజీబీవీకి చపాతీ మిక్సర్ మిషన్‌ను వితరణ చేసి ఆర్జేడీ సోమిరెడ్డి తన సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమారి స్వాతి చదువులో ప్రతిభ కనబరుస్తోందని పాఠశాల ప్రత్యేక అధికారి నారాయణమ్మ ఆర్జేడీకి తెలిపారు. స్వాతి నీట్ శిక్షణ కోసం బొమ్మలరామారం జూనియర్ కళాశాలకు ఎంపికైనప్పటికీ, ఆర్థిక పరిస్థితుల కారణంగా వెళ్లలేకపోతోందని వివరించారు. దీంతో స్వాతితో స్వయంగా మాట్లాడిన ఆర్జేడీ సోమిరెడ్డి.. ఆమె శిక్షణకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ శిక్షణకు వెళ్లి, నీట్‌లో మంచి ర్యాంకు సాధించాలని ఆమెను ఆశీర్వదించారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీ ఇమ్మాన్యుయేల్, పాఠశాల ఎస్ఓ శ్రీమతి నారాయణమ్మ, గ్రాఖ మాజీ జిల్లా అధ్యక్షులు శ్రీ రామచంద్రరావు, ఉపాధ్యాయుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి

**ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి ఎన్. హంసారెడ్డి**



**హనుమకొండ, సెప్టెంబర్ 30:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్. హంసారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం హనుమకొండ మండల డిప్యూటీ తహసీల్దార్‌కు పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా హంసారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. పింఛన్లు రూ.4 వేలకు పెంచాలని, మహిళలకు నెలకు రూ.2 వేలు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు అందించాలని డిమాండ్ చేశారు. గుడిసె వాసులకు ఇంటి పట్టాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ఉద్యోగ ఖాళీల భర్తీ, నిరుద్యోగ భృతి అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గడ్డం నాగార్జున, మాలోతు రాజేష్ నాయక్, చీపురు ఓదయ్య, మంద భద్రయ్య, అన్నబోయిన ప్రేమలత, నూతనకంటి బాబు, శిరీష, అరుణ లక్ష్మి, సంతోష్ పాల్గొన్నారు.

# గాంధీ జయంతి: అక్టోబర్ 2న హైదరాబాద్‌లో మాంసం దుకాణాలు బంద్

**హైదరాబాద్ :** జీహెచ్‌ఎంసీ పరిధిలో వర్తించనున్న అధికారిక ఆదేశాలు వధశాలలు, రిటైల్ మాంసం దుకాణాలపై పూర్తి నిషేధం నిబంధనల కఠిన అమలుకు పోలీసుల సహకారం కోరిన జీహెచ్‌ఎంసీమహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని 2026 అక్టోబర్ 2న గ్రేటర్ వధశాలలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ మేకలు, పశువుల వధశాలలతో పాటు అన్ని రకాల రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను అక్టోబర్ 2న పూర్తిగా మూసివేయాల్సి ఉంటుంది. జీహెచ్‌ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 533(బి) ప్రకారం, స్టాండింగ్ కమిటీ తీర్మానం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.ఈబంధనలను కఠినంగా అమలు చేసేందుకు తమ సిబ్బందికి సహకరించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్లను జీహెచ్‌ఎంసీ కోరింది.

# శిక్షణతోనే సమర్థ పోలీస్ నాయకత్వం

**ప్రొబేషనరీ డీఎస్పీలకు డీజీపీ సీ.వి. ఆనంద్ దిశానిర్దేశం**




**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబరు 30 (పీపుల్స్ న్యూస్ )**
పోలీస్ అధికారుల కెరీర్‌కు శిక్షణే పునాది అని తెలంగాణ డీజీపీ సీ.వి. ఆనంద్ అన్నారు. సమర్థవంతమైన పోలీస్ అధికారులుగా ఎదగాలంటే క్రమశిక్షణ, నిబద్ధత, నాయకత్వ లక్షణాలతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు.
ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో డీజీపీ బుధవారం ముఖాముఖి నిర్వహించారు. సుమారు గంటన్నరపాటు జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ నాయకత్వం, బాధ్యతలు, నైతికత, ప్రజలతో వ్యవహరించే తీరు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

**బాస్ వేరు.. నాయకుడు వేరు.**
పదవిలో ఉన్నంత మాత్రాన నాయకత్వం రాదని డీజీపీ పేర్కొన్నారు. ధైర్యం, స్పష్టమైన దార్శనికత, సమగ్రత, నైతిక విలువలు, బృంద స్ఫూర్తి, నిష్పక్షపాత వైఖరి, సమర్థమైన కమ్యూనికేషన్, కష్టపడి పనిచేసే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతతో పాటు వినయం నాయకత్వానికి కీలకమని వివరించారు.యువ అధికారులు నైతిక విలువలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విధి నిర్వహణలో చేసే చిన్న పొరపాట్లు కూడా భవిష్యత్తులో ప్రతిష్ఠపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. పోలీస్ సర్వీసులో సుదీర్ఘ కెరీర్ ఉండే నేపథ్యంలో ప్రతి అధికారి తన ప్రతిష్ఠను కాపాడుకోవడం అత్యంత కీలకమని తెలిపారు.

**చట్ట పరిజ్ఞానంతో పాటు మానవీయ దృక్పథం.**
శిక్షణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లపై ప్రొబేషనరీ అధికారులు అవగాహన పెంచుకోవాలని డీజీపీ సూచించారు. ప్రజలతో వ్యవహరించడం, నేరాల దర్యాప్తు, చట్టాల అమలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో వినియోగించడం వంటి అంశాల్లో సమగ్ర నైపుణ్యం పెంపొందించుకోవాలని చెప్పారు.చట్టాలపై పరిజ్ఞానంతో పాటు నాయకత్వం, మానవీయ దృక్పథం, దర్యాప్తు నైపుణ్యం, సాంకేతిక అవగాహన, శారీరక దృఢత్వం, ప్రజలతో సమర్థమైన కమ్యూనికేషన్ అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు భద్రత కల్పించడం, వారికి సకాలంలో న్యాయం అందేలా చూడటమే పోలీసింగ్ అంతిమ లక్ష్యమని డీజీపీ స్పష్టం చేశారు.

**10 నెలల ప్రొఫెషనల్ కోర్సు.**
తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. ప్రొబేషనరీ డీఎస్పీల ప్రొఫెషనల్ కోర్సులో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు కలిపి 112 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. సుమారు 10 నెలలపాటు జరిగే కోర్సులో ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.భారతీయ న్యాయ సంహిత, క్రిమినల్ లా, క్రిమినాలజీతో పాటు నేర దర్యాప్తు, మోడల్ పోలీసింగ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఆర్థిక నేరాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సీనియర్ పోలీస్ అధికారులు, వివిధ రంగాల నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.క్షేత్రస్థాయి పరిస్థితులను ఎదుర్కొనేందుకు కాంబాట్ వ్యాయామాలు, గుర్రపు స్వారీ, ఈత, వివిధ రకాల ఆయుధాల వినియోగంపై ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు.

**క్రీడలతో దేహదారుఢ్యం.. మానసిక ఉల్లాసం.**
అనంతరం 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 క్లస్టర్--సీ విజేతలకు డీజీపీ పతకాలు, బహుమతులు అందజేశారు. సెప్టెంబరు 28న ప్రారంభమైన మూడు రోజుల పోటీలు బుధవారం ముగిశాయి.బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారుల వరకు 700 మందికి పైగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ఒత్తిడితో కూడిన విధులు నిర్వహించే పోలీసులకు శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని






డీజీపీ అన్నారు. ప్రతి పోలీస్ అధికారి రోజుకు కనీసం గంటపా టు క్రీడలు లేదా శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు.

**క్లస్టర్ విధానంతో మరింత మందికి అవకాశం.**
పోలీస్ క్రీడలను గతంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించేవారని, ప్రస్తుతం క్లస్టర్ విధానం ద్వారా ఎక్కువ మంది పోలీస్ క్రీడా కారులకు అవకాశాలు కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. క్లస్టర్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి, వారి కి మరింత పోటీ అనుభవం కల్పించడం ద్వారా ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. పోలీస్ శాఖలో క్రీడలకు మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐజీపీ (పిఏఎల్) గజరావు భూపాల్, డిప్యూటీ డైరెక్టర్లు చేతన, మురళీధర్, ఇతర సీనియర్ అధికారులు, అకాడమీ సిబ్బంది, ట్రైనీ ప్రొబేషనరీ డీఎస్పీలు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

**మల్కాజిగిరి సీపీ బి. సుమతి ఆధ్వర్యంలో నెలవారీ నేర సమీక్ష**












**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**
మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సీపీ బి. సుమతి ఐపీఎస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని మొత్తం నేర పరిస్థితి, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, పోలీసింగ్ పనితీరును సమీక్షించారు.నేరాల ఛేదన, నాణ్యమైన దర్యాప్తు, కేసుల్లో శిక్షలు పడేలా చర్యలు, సైబర్ నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల నిఘా, ముందస్తు పోలీసింగ్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సీపీ అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను అధికారులు నిశితంగా పర్యవేక్షించాలని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండటంతో పాటు సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తృతం చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని అధికారులకు సూచించారు.

## హైదరాబాద్ కమిషనరేట్‌లో
# 18 మంది పోలీసు అధికారుల పదవీ విరమణ
















**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుమారు 42 ఏళ్లపాటు సేవలందించిన 18 మంది పోలీసు అధికారులు బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలతో పాటు సొసైటీ తరపున అందించే రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పదవీ విరమణ అనంతరం లభించే ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక వడ్డీల ఆశతో ప్రైవేట్ వ్యక్తులు, మోసపూరిత సంస్థల బారిన పడకుండా రిటైర్మెంట్ నిధులను సురక్షితమైన ప్రభుత్వ రంగ సంస్థల్లోనే డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. అలాగే పదవీ విరమణ అనంతరం ప్రారంభమయ్యే 'సెకండ్ ఇన్నింగ్స్'లో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కుటుంబ సభ్యులు పదవీ విరమణ చేసిన వారికి అండగా నిలిచి సహకరించాలని కోరారు. పదవీ విరమణ పొందిన వారిలో ఏసీపీలు పత్తిపాటి విక్రమ్ దేవ్ (సీటీసీ), రాయకూర్ సంజయ్ కుమార్ (సైఫాబాద్), ఐదుగురు ఎస్సైలు, ఆరుగురు ఏఎస్సైలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్, ఇద్దరు ఎల్‌జీఎస్ సిబ్బంది ఉన్నారు. దీర్ఘకాలం పోలీస్ శాఖలో సేవలందించి పదవీ విరమణ పొందిన అధికారులను హైదరాబాద్ సిటీ పోలీస్ తరపున సగౌరవంగా వారి నివాసాలకు చేర్చేందుకు ప్రత్యేక ంగా ప్రభుత్వ వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) కె. వెంకటలక్ష్మి, సీఏడీవో జెబీజె ఆనంద్ కుమార్, సీఏవో చంద్రకళ, ఏవో యాదగిరి, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సొసైటీ కార్యదర్శి నల్ల శంకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ ఖాన్, కోశాధికారి జి.ఎం.ఎస్. విక్టర్ తదితరులు పాల్గొన్నారు.






# దొంగతనం కేసులను ఛేదించిన మేడిపల్లి పోలీసులు..

**- నిందితుడి తో సహా**

**2.50లక్షల విలువైన ఆస్తి స్వాధీనం.**

**మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**

చెంగిచెర్ల ప్రాంతంలో జరిగిన దొంగతనాల కేసులకు సంబంధించి బబ్లు పాశ్వాన్ (45)ను మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తి విలువ సుమారు రూ. 2.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మేడిపల్లి స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్‌స్టేషన్, చెంగిచెర్ల ప్రాంతంలో జరిగిన దొంగతనాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బబ్లు పాశ్వాన్‌ను గుర్తించి అరెస్టు చేశారు. చెంగిచెర్ల ప్రాంతంలో



నమోదైన మొత్తం తొమ్మిది కేసుల్లో బబ్లు పాశ్వాన్ దొంగతనాలకు పాల్పడినట్లు తేలింది. ఇందులో నాలుగు ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులు, ఒక సెల్‌ఫోన్ దొంగతనం కేసు, నాలుగు ఇళ్లలో చోరీ కేసులు ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి తెలిపారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బబ్లు పాశ్వాన్ జార్ఖండ్‌లోని గిరిడిహ్‌కు చెంది నవాడని, ప్రస్తుతం జీడిమెట్ల చింతల్‌లోని గణేష్‌న గర్‌లో నివాస ముంటూ, కూలీగా పనిచేస్తు న్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అరెస్టు చేసిన నిందితుడిని రిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## జగద్గిరిగుట్టలో ఘనంగా 'అంగన్ మిలన్' సేవా కార్యక్రమం

**అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు సన్మానం**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30:**
సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 'అంగన్ మిలన్' సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరకల సుధ వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి.. రికార్డులు తిరిగివ్వాలి

**అక్టోబర్ 1న ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా: సర్పంచ్ దుర్గం సరోజ**



**కొమరం భీం/బెజ్జూరు, సెప్టెంబర్ 30**
గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అదనపు కలెక్టర్ తనిఖీల సందర్భంగా తీసుకెళ్లిన రికార్డులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 1న ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు బెజ్జూరు గ్రామపంచాయతీ సర్పంచ్ దుర్గం సరోజ తెలిపారు. సర్పంచ్‌గా ఎన్నికై తొమ్మిది నెలలు పూర్తయిన నేపథ్యంలో గ్రామపంచాయతీ నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టానని ఆమె పేర్కొన్నారు. అయితే మూడు నెలలుగా చేసిన పనులకు సంబంధించిన బిల్లులను అధికారులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. జూలై 14న అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీల సందర్భంగా గ్రామపంచాయతీ రికార్డులను తీసుకెళ్లారని, ఇప్పటివరకు వాటిని తిరిగి ఇవ్వలేదని సరోజ పేర్కొన్నారు. దీనివల్ల గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోందన్నారు. తాను దళిత సర్పంచ్ కావడం వల్లే ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు, రికార్డుల తిరిగి అప్పగింత కోసం చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని గ్రామస్తులను సర్పంచ్ దుర్గం సరోజ కోరారు.

## మూడుచెక్కలపల్లిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**బ్యాంకింగ్ సేవలు, రుణాలు, బీమా పథకాలు, సైబర్ మోసాలపై సూచనలు**



**నల్లబెల్లి, సెప్టెంబర్ 30 ):** మూడుచెక్కలపల్లి గ్రామంలో గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, రుణాలు, బీమా పథకాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించేందుకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ బ్యాంకు వరంగల్ జిల్లా ప్రధాన జిల్లా నిర్వహణాధికారి జీవన్‌కుమార్ హాజరై బ్యాంకు లావాదేవీలు, బంగారు రుణాల పునరుద్ధరణ, పంట రుణాలపై వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను నిర్ణీత సమయంలో చెల్లిస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవన్‌కుమార్ సూచించారు. ఓటీపీ, పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులతో పంచుకోవద్దని చెప్పారు. సైబర్ మోసానికి గురై నగదు కోల్పోతే వెంటనే 1930 సహాయ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బర్ల యాకయ్య, సుభాష్ సునీత దంపతుల కుమారుడు రోహిత్ ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా ఆయనను జీవన్‌కుమార్ సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు క్షేత్రస్థాయి అధికారి గోవింద్ చవాన్, ఆర్థిక అక్షరాస్యత కేంద్ర ప్రతినిధి భాస్కరచారి, గ్రామ సర్పంచ్ సపావట్ కవిత దేవునాయక్, ఉప సర్పంచ్ ఇస్లావత్ స్వరూప, బ్యాంకు మిత్ర అడ్డగట్ల శంకర్, ఆర్థిక అక్షరాస్యత కేంద్ర సలహాదారు హారిక, నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ ప్రాజెక్టులో విషాదం: నీటిలో తేలిన వృద్ధురాలి శవం



**ముధోల్ (సారంగాపూర్), సెప్టెంబరు 30:**
నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులో ఒక వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. మృతురాలిని కౌట్ల (బి) గ్రామానికి చెందిన దేవి చిన్నమ్మగా పోలీసులు గుర్తించారు.ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఘటనకు గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని,కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

# సేవకు సెల్యూట్.. ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన వీడ్కోలు

**మల్కాజ్‌గిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**
మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలం అంకితభావంతో సేవలందించిన ముగ్గురు పోలీసు అధికారులు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్‌తో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొని పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు.ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఏడీసీపీ (క్రైమ్స్) జష్త. రామేశ్వర్, ఆర్ఎస్ఐ (సీఏఆర్ అంబర్‌పేట్) ఏ. కృష్ణారెడ్డి, ఎస్ఐ (నాచారం పోలీస్ స్టేషన్) పి. ప్రభాకర్ రెడ్డి ఉన్నారు. పోలీస్ శాఖలో వారు అందించిన సేవలను అధికారులు ఈ సందర్భంగా అభినందించారు.కార్యక్రమంలో సీపీ బి. సుమతి మాట్లాడుతూ.. పోలీస్ విధుల్లో ఎదురయ్యే ప్రతి పరిస్థితి నుంచి అనుభవాన్ని నేర్చుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో పొందిన అనుభవాన్ని భవిష్యత్ జీవితంలో సానుకూలంగా ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు.పోలీస్ శాఖలో అందించిన సేవలకు ఉద్యోగ విరమణ ముగింపు కాదని, సమాజం పట్ల అంకితభావంతో సాగిన సేవా ప్రయాణంలో ఇది గౌరవప్రదమైన మైలురాయి అని అధికారులు పేర్కొన్నారు.ఈ



కార్యక్రమంలో పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు

# పౌర జీవితంలో ప్రభుత్వ పాలనా శాస్త్రం కీలకం




**ముధోల్(నిర్మల్ టౌన్), సెప్టెంబర్ 30**
నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పౌర జీవితంలో ప్రభుత్వ పాలనా శాస్త్ర ప్రాముఖ్యతపై బుధవారం ఒక విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలోని ప్రభుత్వ పాలనా శాస్త్ర (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ అధ్యక్షత వహించగా, భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు లెఫ్టినెంట్ డాక్టర్ భీంరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజాపాలన భావన అనేది కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా, సమాజంలో ఒక ఆలోచనా విధానంగా పుట్టి,ఆ తర్వాత చట్ట రూపం దాల్చిందని వివరించారు. పౌరుల దైనందిన జీవితంలో ప్రభుత్వ పాలన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# తవ్వి వదిలేసిన రోడ్డుతో నరకయాతన.

- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- రెండు నెలలుగా రోడ్డు దుస్థితి..
- విద్యార్థులు, వాహనదారులు సహా స్థానికుల అవస్థలు



**ఉప్పల్ : ప్రతినిధి శ్రవణ్ కుమార్ సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**
పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో రాఘవేంద్ర కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, రెడ్డీస్ శ్మశానవాటిక వెనుక వైపు చిలకానగర్ రోడ్డులో, శ్రీనగర్ కాలనీ స్ట్రీట్ నంబర్--8 చివరన నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా ఈ సమస్య నెలకొంది. సుమారు రెండు నెలల క్రితం పైపులైన్



ఏర్పాటు కోసం జీహెచ్ఎంసీ అధికారులు సుమారు 50 మీటర్ల మేర రోడ్డును తవ్వారు. అయితే స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో పనులను మధ్యలోనే నిలిపివేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి తవ్విన రోడ్డును అలాగే వదిలేయడంతో మట్టి, గుంతలు, బయటకు వచ్చిన రాళ్లతో రహదారి అధ్వానంగా మారింది. పనులు పూర్తిచేయకపోవడంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ఈ రహదారిపై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లే సమయంలో తవ్విన ప్రాంతం కారణంగా జాగ్రత్తగా ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు సైతం గుంతలు, రాళ్ల మధ్య రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తవ్విన ప్రాంతం వద్ద అదుపు తప్పే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. గుంతలు, ఎగుడుదిగుడు రహదారి కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు, వాహనాలు దెబ్బతినే పరిస్థితి ఉందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడంతో ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు తవ్వడంతో పెద్ద పెద్ద గుంతలు, రాళ్లు బయటకు రావడంతో పలువురు వాటికి తగిలి కిందపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని, కొందరికి గాయాలయ్యాయని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు కూడా ఈ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కార్యాలయాల చుట్టూ తిరిగి ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని కాలనీ వాసులు అంటున్నారు. పైపులైన్ పనులు కొనసాగించాలనుకుంటే వాటిని పూర్తిచేయాలని, లేదంటే తవ్విన మట్టిని తొలగించి రోడ్డును యథావిధిగా పునరుద్ధరించాలని కోరుతున్నారు. ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిన ఈ రహదారిపై అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థులు, వాహనదారులు, వృద్ధులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తవ్విన ప్రాంతంలో వెంటనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి సురక్షితమైన రాకపోకలకు మార్గం కల్పించాలని కోరుతున్నారు. ప్రజల సమస్యను ఇకనైనా అధికారులు పట్టించుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని రాఘవేంద్ర కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రధాని మోదీపై సీఎం రేవంత్ వ్యాఖ్యల దుమారం...బాసరలో బీజేపీ నిరసన హోరు

### ముఖ్యమంత్రి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్



**ముధోల్ (బాసర), సెప్టెంబర్ 30**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బాసర మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు నిరసనకు దిగాయి.బీజేపీ రాష్ట్ర నాయకులు రామచందర్ రావు, జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ పిలుపు మేరకు స్థానిక కూడలిలో బీజేపీ నాయకులు భారీ రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా బాసర మండల బీజేపీ అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ పటేల్ మాట్లాడుతూ..దేశ ప్రధానిపై ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అత్యంతశోచనీయమన్నారు.సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన', 'సీఎం డౌన్ డౌన్' అంటూ నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు కొండాపురం గంగాధర్, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ పోగుల రాజేశ్వర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బలాపురం మనోహర్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రతినిధులు, జిల్లా కిసాన్ మోర్చా ప్రతినిధులు దేవునే శంకర్,బిద్ధూర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టిని మింగేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

### కరిగిపోతున్న నవాబుపేట శివారు గుట్ట
### సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్

**టేకుమట్ల.సెప్టెంబర్ 30**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేట శివారులోని గుట్టను అక్రమంగా తవ్వుతూ మట్టిని తరలిస్తున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ ఆరోపించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకున్నామని చెబుతూ, అనుమతులకు మించి పెద్దఎత్తున గుట్టను తవ్వుతున్నారని అన్నారు.గుట్ట చుట్టూ సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాలు జరుగుతున్నప్పటికీ స్థానిక తహ‌సీల్దార్ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.అక్రమంగా మొరం,మట్టిని తరలిస్తూ సహజ వనరులను దోచుకుంటున్నా జిల్లా కలెక్టర్,జిల్లా మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే తవ్వకాలను నిలిపివేసి,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గుట్టను పూర్తిగా తొలగించేలా ఎలాంటి అనుమతులు ఉండవని,అనుమతుల పరిధిని మించి తవ్వకాలు ఎలా జరుగుతున్నాయో అధికారులు స్పష్టం చేయాలని కోరారు.గతంలో అసైన్మెంట్ భూమిగా ఉన్న భూములు ప్రభుత్వాలు మారినప్పుడల్లా పట్టా భూములుగా మారిన విషయంపై కూడా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరుతో స్థానిక సహజ వనరులను తరలించడం వల్ల చిన్న, సన్నకారు రైతులకు, నిరుపేదలకు కలిగే ప్రయోజనం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని మల్లేష్ అన్నారు.సహజ వనరుల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గుట్ట ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.వెంటనే మట్టి తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అంబాల అశ్వద్ధామ,సంగీ రాజు,అంజయ్య,అనిల్ పాల్గొన్నారు.



# వీరమాచినేని రామకృష్ణపై క్రిమినల్ కేసు.




‘వీఆర్‌కే డైట్’తో టైప్-1 డయాబెటిస్ నయం చేస్తానంటూ హామీ.








**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)** ‘వీరమాచినేని డైట్’, ‘వీఆర్‌కే డైట్’ పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వీరమాచినేని రామకృష్ణపై రాయదుర్గం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. టైప్-1 డయాబెటిస్‌తో బాధ పడుతున్న సాయి కృష్ణ (30) ఏళ్ల న్యాయ విద్యార్థికి ఇన్సులిన్ వాడటం నిలిపివేసి, తాము సూచించిన డైట్‌ను మాత్రమే పాటించాలని చెప్పారని, అనంతరం అతడి ఆరోగ్యం తీవ్రంగా క్షీణించి ఆసుపత్రిలో చేరాల్సి వచ్చిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు. రామకృష్ణతో పాటు మరో డాక్టర్ కోటేశ్వరరావుపైనా కేసు నమోదైంది. నిర్మల్ జిల్లాకు చెందిన కళ్లెడ సాయికృష్ణకు 2018 నుంచి టైప్-1 డయాబెటిస్ ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రోజూ ఇన్సులిన్‌పై ఆధారపడే ఆయన సోషల్ మీడియాలో వీరమాచినేని రామకృష్ణకు సంబంధించిన వీడియోలను చూశారని తెలిపారు.

‘వీఆర్‌కే డైట్’ ద్వారా టైప్-1 డయాబెటిస్‌తో పాటు ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను కూడా నయం చేయవచ్చంటూ వీడియోల్లో ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ప్రచారాన్ని నమ్మిన సాయికృష్ణ 2025 సెప్టెంబరు 12న రాయదుర్గంలోని వీఆర్‌కే హెల్త్‌కేర్ సెంటర్‌ను సంప్రదించినట్లు ఫిర్యాదులో తెలిపారు. అక్కడ తనకు టైప్-1 డయాబెటిస్ ఉన్న విషయం తెలిసినప్పటికీ ఇన్సులిన్ తీసుకోవడం ఆపాలని, వీఆర్‌కే డైట్‌ను అనుసరించాలని సూచించినట్లు ఆరోపించారు. డైట్, సప్లిమెంట్లు, ఇతర సేవల కోసం తన నుంచి సుమారు రూ.26 వేలు తీసుకున్నారని బాధితుడు పోలీసులకు తెలిపాడు. తనకు ఇచ్చిన బిల్లులో జీఎస్టీ వివరాలు లేవని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. కేంద్రంలో అందిస్తున్న సేవలు, అక్కడ పనిచేస్తున్న వ్యక్తుల అర్హతలు, వివిధ అనుమతులు, సప్లిమెంట్ల చట్టబద్ధత తదితర అంశాలను కూడా పరిశీలించాలని బాధితుడు పోలీసులను కోరినట్లు తెలుస్తోంది. వీఆర్‌కే కేంద్రం నుంచి వచ్చిన సూచనల మేరకు ఇన్సులిన్ తీసుకోవడం నిలిపివేసిన తర్వాత తన ఆరోగ్యం క్షీణించిందని సాయికృష్ణ ఆరోపించారు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంతో పాటు ఒళ్లు నొప్పులు, వాంతులు వంటి సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. 2025 సెప్టెంబరు 14న ఆయన సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చేరినట్లు ఫిర్యాదు వివరాల్లో ఉంది. వైద్యులు డయాబెటిక్ కీటోఆసిడోసిస్ తీవ్రమైన డీహైడ్రేషన్ ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. సెప్టెంబరు 17న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినప్పటికీ, చికిత్స కోసం సుమారు రూ.58,219 ఖర్చయిందని బాధితుడు తెలిపాడు. తనకు వైద్య సలహాలు ఇచ్చిన వ్యక్తుల అర్హతలు, రిజిస్ట్రేషన్లను కూడా పరిశీలించాలని బాధితుడు పోలీసులను కోరారు. రామకృష్ణ తన వీడియోల్లో తాను బీకాం చదివినట్లు చెప్పుకున్నారని, కోటేశ్వర రావుహోమియోపతివైద్యుడిగా ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ భూపతి మాట్లాడుతూ..**

బాధితుడు సాయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ భూపతి తెలిపారు. బాధితుడు తీసుకున్న డైట్ ప్లాన్, అతనికి అందించిన సూచనలు, వాటి ప్రభావం తదితర అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేస్తామని చెప్పారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఫుడ్ సేఫ్టీ అధికారులు, వైద్య నిపుణుల సూచనలు తీసుకుంటామని, శాస్త్రీయ ఆధారాలు మరియు నిపుణుల అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం తదుపరి చట్టపరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఇప్పటికే వీరమాచినేని రామకృష్ణపై క్రిమినల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ భూపతి తెలిపారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా చట్ట ప్రకారం చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలు కూడా సోషల్ మీడియా, ఆన్‌లైన్‌లో వచ్చే ఆరోగ్య సంబంధిత ప్రకటనలు, డైట్ సూచనలను నమ్మే ముందు ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని, అర్హత కలిగిన వైద్య నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. కేసులోని అన్ని కోణాలను పరిశీలించి, బాధితుడికి న్యాయం జరిగేలా సమగ్ర దర్యాప్తు చేపడుతున్నామని ఇన్‌స్పెక్టర్ భూపతి తెలిపారు.

## ఎరువుల డిజిటల్ బుకింగ్‌పై రైతులకు అవగాహన సదస్సు



**ముధోల్ (తానూర్), సెప్టెంబర్ 30):** నిర్మల్ జిల్లా తానూర్ మండలం తొండాల గ్రామంలో బుధవారం రైతులకు ఎరువుల బుకింగ్ మొబైల్ యాప్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి (ఏఈఓ) పవన్ ప్రసాద్, జవుల (బి) క్లస్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్’ యాప్ ద్వారా యూరియా,డీఏపీ వంటి ఎరువులను సులభంగా ఎలా బుక్ చేసుకోవాలో రైతులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా దుకాణాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా,ఎలాంటి ఇబ్బందులు పడకుండా నేరుగా ఎరువులను పొందే విధానాన్ని రైతులకు క్షుణ్ణంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30 (:** ‘సేవా సంకల్ప్ అభియాన్’లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మగ్దూంనగర్ నాగార్జున హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. బీజేపీ మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి సూచన మేరకు, రోడామిస్త్రీనగర్ 279 డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నేమూరి నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విద్యార్థుల్లో సృజనాత్మకత, రచనా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించడమే పోటీల లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ సహకరించగా, నారాయణపేట జిల్లా ఇన్‌చార్జి గోపతి భాను చందర్ వర్మ, రాజేష్, సల్లూరి వీరాచారి తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## ఉచిత కుట్టు శిక్షణతో స్వయం ఉపాధికి బాట




**కొమరం భీం/ బెజ్జూరు సెప్టెంబర్ 30,**

మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి సాధించాలని బెజ్జూరు గ్రామపంచాయతీ సర్పంచ్ దుర్గం సరోజ సూచించారు. బుధవారం బెజ్జూరు మండల కేంద్రంలో జన ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మాజీ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా జావిద్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గం సరోజ మాట్లాడుతూ మహిళలు కుట్టుపనిలో నైపుణ్యం సాధిస్తే సొంతంగా ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉచితంగా అందిస్తున్న శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సెండే పద్మ, గ్రామస్తులు అమీరుద్దీన్, జాకీర్ హుస్సేన్, రమేష్, నరేందర్ గౌడ్, జావిద్, తిరుపతి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తే ఓ లెక్క..!

**- ప్రైవేటు భూములలో అంతస్తులు పెంచితే మరో లెక్క !**

**లంచాల లెక్కల్లో అక్రమ నిర్మాణం?**






**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 30 (పీపుల్స్ న్యూస్)**

అక్రమ నిర్మాణం నిటారుగా నిలబడి రంగులు వేయడం కనిపిస్తోంది.. రాకపోకలప్పుడు అధికారులు కూడా చూస్తున్నారు.. కానీ చర్యలు మాత్రం కనిపించడం లేదు! గాజులరామారం దేవేందర్ నగర్‌లోని సర్వే నంబర్ 329లో 283 గజాల స్థలంలో జరుగుతున్న నిర్మాణంపై ఇదే ప్రశ్న ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు స్పందించాల్సి ఉన్నప్పటికీ, నిర్మాణదారు మాజీ కార్పొరేటర్ కావడంతోనే చర్యలకు వెనుకడుగు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల్లో నిర్మాణం చేస్తే ఒక లెక్క. , ప్రైవేట్ భూమిలో నిర్మాణానికి మరో లెక్క.. నోటరీ భూమిలో నిర్మాణం చేస్తే ఇంకో లెక్క, అనుమతులకు మించి అంతస్తులు పెంచితే అధికారుల లెక్కలు ఎప్పటికప్పుడు మారుతూనే ఉంటాయని ప్రజలు ఆరోపిస్తున్నారు . ఇలా నిర్మాణం ఏ విధంగా ఉన్నా అధికారుల దృష్టికి వస్తుందని, కానీ చర్యల విషయంలో మాత్రం మౌనం పాటిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై సాధారణ ప్రజలకు నోటీసులు, పనుల నిలిపివేత, ఇతర చర్యలు తప్పనిసరిగా అమలు చేసే అధికారులు.. పలుకుబడి ఉన్న వ్యక్తుల విషయంలో మాత్రం ఎందుకు మెతక వైఖరి అవలంబిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం..**

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం జరుగుతోందంటూ అనేక మార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వరుస ఫిర్యాదులు, అభ్యంతరాల అనంతరం అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ.. ఆ చర్యలు కేవలం నామమాత్రంగానే మిగిలిపోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గాజులరామారం సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్ 329లో 283 గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం జరుగుతోందని ఫిర్యాదులు అందినట్లు సమాచారం. అనుమతులకు విరుద్ధంగా జి ప్లస్ ఫోర్ నిర్మాణం చేపట్టడంతో పాటు పైభాగంలో పెంట్‌హౌస్ నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నిర్మాణంపై పలుమార్లు ఫిర్యాదులు చేసిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలకు దిగారు. అయితే భారీ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించడం, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం బదులు.. పెంట్‌హౌస్‌లోని రెండు, మూడు ఇటుకలు తొలగించి చర్యలు తీసుకున్నట్లు చూపించడంపై స్థానికులు, ఫిర్యాదుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**చర్యల పేరుతో మమ అనిపించారా?**

అక్రమ నిర్మాణం జి ప్లస్ ఫోర్ స్థాయికి చేరుకునే వరకు అధికారులు ఏం చేశారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణం జరుగుతున్న సమయంలోనే గుర్తించి అడ్డుకోవాల్సిన అధికారులు.. ఫిర్యాదులు వచ్చిన తర్వాత కూడా పూర్తిస్థాయి చర్యలు తీసుకోకుండా చివరికి పైభాగంలోని పెంట్‌హౌస్‌కు చెందిన కొద్దిపాటి ఇటుకలు తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నిర్మాణం పెద్ద స్థాయికి చేరుకున్న తర్వాత నామమాత్రపు చర్యలు చేపట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొదటి నుంచే అధికారులు కఠినంగా వ్యవహరించి ఉంటే నిర్మాణం ఇంతవరకు వచ్చేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు.. నిర్మాణం పూర్తయ్యే వరకు మౌనం వహించి, ఫిర్యాదులు పెరిగిన తర్వాత కేవలం పైభాగంలో కొన్ని ఇటుకలు తొలగించడం పై ప్రజల మండిపడుతున్నారు.

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక




## ముడి పామాయిల్ పై దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్..




**ఏలూరు సెప్టెంబర్ 30 :** కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతిపై ఉన్న సుంకాన్ని 16.5 శాతం నుండి 11 శాతానికి తగ్గించడం దేశ, రాష్ట్ర ఆయిల్ పామ్ రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తుందని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో ముడి పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపుపై వారుమాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న 27 శాతం దిగుమతి సుంకాన్ని 16.5 శాతానికి తగ్గించి ఒదన్నారు .ఇపుడు మళ్లీ 11 శాతానికి తగ్గించారని చెప్పారు. దేశీయ వంటనూనెల ఉత్పత్తిని అస్థిరపరిచి, వంటనూనెల విషయం లో దేశం స్వయం సమృద్ధి సాధించే లక్ష్యానికి విఘాతం కలిగించే తిరోగమన నిర్ణయం అని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో వేరుశెనగ, నువ్వులు,ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పత్తి దిగుమతి పై ఉన్న 30 శాతం దిగుమతి సుంకాన్ని 11 శాతానికి ఇపుడు సున్నాకు తగ్గించారని చెప్పారు. ఫలితంగా లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్న పత్తి రైతులకు మద్దతు ధరలు లభించలేదన్నారు.ఇపుడు నూనె గింజలు పండించే ఆయిల్ పామ్, వేరుశనగ, నువ్వులు తదితర పంటల రైతులు దివాళా తీస్తారని, రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.ముడి పామాయిల్ పై కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.25 వేలు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయిల్ పామ్ రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## సమాజ నిర్మాణమే ప్రధాని మోదీ లక్ష్యం



- పేర్కిపాలెంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సత్కరించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు

**వీరవాసరం, సెప్టెంబర్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాలుగా నిరంతరం ప్రజా సేవకే అంకితమయ్యారని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అంజిబాబు అన్నారు. ప్రజా సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా మండలంలోని పెర్కిపాలెంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సత్కరించారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు విశేష సేవలందిస్తున్న టీచర్లు, ఆయాల సేవలు ఎనలేనివని అన్నారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ ఎంపికయ్యే అవకాశం

- అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్



సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కోసం ఢిల్లీ, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల పేర్లను కూడా కొలీజియం సిఫార్సు చేసింది ఒక ముఖ్యమైన పరిణామంలో, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్‌తో పాటు, గుజరాత్ మరియు ఢిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ మరియు న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, బి.వి. నాగరత్న, ఎం.ఎం. సుందరేష్, పి.ఎస్. నరసింహలతో కూడిన ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. సిఫార్సు చేసిన పేర్లకు కేంద్రం ఆమోదం తెలిపితే,సుప్రీంకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరుతుంది (మొత్తం మంజూరైన స్థానాల సంఖ్య 38). ప్రస్తుతం సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల, సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ చట్టం ద్వారా కోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్యను 34 నుండి 38కి పెంచారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన నిర్దేశిత విధానం ప్రకారం కొలీజియం సిఫార్సుపై తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

## అర్ధరాత్రి అదుపుతప్పిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముగ్గురికి స్వల్ప గాయాలు



సూర్యాపేట జిల్లాలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మోతే మండలం హుస్సేనాబాద్ సమీపంలో ట్రావెల్స్ బస్సు (చీూ 015579) అదుపుతప్పి బోల్తాపడింది. హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. బస్సు బోల్తాపడటంతో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. నిద్రమత్తే కారణమా హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, నిర్లక్ష్యం కారణంగానే బస్సు అదుపుతప్పినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

## లక్కవరంలో పోలింగ్ బూత్ లను పరిశీలించిన డీఎస్పీ




**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 30 :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్ లను జంగారెడ్డిగూడెం డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అయితే ప్రభుత్వం అదే హైస్కూల్లో 35 కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఈ నిఘా నేత్రాలు ఎన్నికలకు బాగా ఉపయోగపడతాయని పోలీసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బూత్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట లక్కవరం ఎస్సై జబ్బీర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## అరసవల్లి అభివృద్ధికి రూ. 55.74 కోట్లు మంజూరు పై హర్షం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు
- శ్రీకాకుళం జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, సెప్టెంబర్ 30:** దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థాన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్-2.0 పథకం కింద రూ. 55.74 కోట్ల నిధులు మంజూరు చేయడంపై రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల కోసం కేంద్ర స్థాయిలో ప్రత్యేక చొరవతో కృషి చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు జిల్లా ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధులతో చేసే అభివృద్ధితో జిల్లాలోని అరసవల్లి పుణ్యక్షేత్రం రానున్న రోజులలో అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విరాజిల్లబోతుందన్నారు. సూర్య దేవాలయ ప్రాధాన్యతను గుర్తించి నిధులు విడుదల చేసిన విశ్వ గురు గా ఖ్యాతి పొందిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శెకావత్, రాష్ట్ర ప్రజల అలాగే ప్రాంతాలవారీగా ప్రజల మనోభావాలకు, ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర మణి కిరీటంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావటంతో రానున్న రోజులలో దేశ విదేశాల నుంచి అరసవల్లి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని ఈ నిధులతో దేవాలయం మరింత అభివృద్ధి చెంది ప్రాచుర్యం పొందుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## పాఠాలు చెప్పకుండా మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతున్న టీచర్.. తమ ఇన్‌స్టాగ్రామ్ ఐడీలు అడుగుతున్నట్లు విద్యార్థినులు ఆరోపణ




**భోపాల్:** ప్రభుత్వ స్కూల్‌కు చెందిన ఒక ఉపాధ్యాయుడు పాఠాలపై దృష్టిసారించడం లేదు. క్లాస్ రూమ్‌లో ఎంచక్కా తన మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ కాలక్షేపం చేస్తున్నాడు. అలాగే ఆ టీచర్ తమ ఇన్‌స్టాగ్రామ్ ఐడీలు అడుగుతున్నారని విద్యార్థినులు ఆరోపించారు. ఆ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారు. మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

కోట్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రశాంత్ అనే ఉపాధ్యాయుడిపై పలు ఆరోపణలు వచ్చాయి. స్కూల్ వేళల్లో తరగతులు నిర్వహించకుండా మొబైల్ గేమ్స్ ఆడుతున్నట్లు స్టూడెంట్స్ ఆరోపించారు. విద్యార్థినుల ఇన్‌స్టాగ్రామ్ ఐడీలను ఆ టీచర్ అడుగుతున్నట్లు బాలికలు ఫిర్యాదు చేశారు. 'ఆ ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పడానికి స్కూల్‌కు వస్తున్నారా? లేక అమ్మాయిల ఇన్‌స్టాగ్రామ్ ఐడీలు అడగడానికి వస్తున్నారా?' అని విద్యార్థినులు ప్రశ్నించారు.

కాగా, విద్యార్థుల ఫిర్యాదులు విద్యా శాఖ అధికారుల దృష్టికి వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఆ ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై అధికారిక విచారణ జరుపుతారా? ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది ఇంకా తెలియలేదు.

## బుద్గాంలో ఎన్‌కౌంటర్ లష్కరే టాప్ కమాండర్ హతం



బుద్గాంలో లష్కరే ఉగ్రవాద కార్యకలాపాలకు ఈ ఎన్‌కౌంటర్ గట్టి ఎదురుదెబ్బ అని భద్రతావర్గాలు విశ్లేషిస్తున్నాయి. బుద్గాం జిల్లాలోని ఎగువ ప్రాంతాలైన యూస్‌మార్గ్ పరిధిలోని కోరాగ్ ఏరియాలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భారత సైన్యానికి చెందిన చినార్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీస్, సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. యూస్‌మార్గ్‌లోని దూద్‌పత్రి అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల అనుమానాస్పద కదలికలను గమనించిన సైనికులు వారిని లొంగిపోవాలని హెచ్చరించారు.కానీ ఉగ్రవాదు లు లొంగిపోకుండా కాల్పులకు తెగబడటంతో భద్రతాబలగాలు దీటుగా ఎదురుకాల్పులు జరిపాయి.

## కార్యకర్తల సంక్షేమానికి జగనన్న పెద్ద పీట - వైసీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి కనకరాజు



**కామవరపుకోట :** వైఎస్సార్‌సీపీలో కార్యకర్తల సంక్షేమానికి పార్టీ అధినేత వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఎప్పుడూ పెద్ద పీట వేస్తారని పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి, కామవరపు కోట సొసైటీ మాజీ అధ్యక్షులు సాయిన కనకరాజు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి, వివిధ కమిటీల్లో పనిచేస్తూ అకాల మరణం చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీ అధినేత రు. 5 లక్షల ఆర్థికసాయం ప్రకటించడం ప్రశంసనీయం అని కనకరాజు పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు అని.. పార్టీ జెండాను భుజాన ఎత్తుకుని పనిచేసే ప్రతి నాయకుడిని, కార్యకర్తను తన సొంత కుటుంబ సభ్యుడిగా భావించే నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి పార్టీ సభ్యత్వం ఉండి ఏ కారణంతో అయినా మరణించిన పార్టీ నేతల కుటుంబాలకు రు. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలన్న పార్టీ అధినేత నిర్ణయం వారి కుటుంబాల్లో కొండంత ధైర్యాన్ని నింపుతుందన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసే ప్రతి కార్యకర్త వెంటా తాను ఉంటానని జగనన్న మరోసారి నిరూపించారని కనకరాజు అన్నారు. జగన్ నిర్ణయం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి ఎస్సై వల్లి పద్మ




**కామవరపుకోట, సెప్టెంబర్ 30, :** యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తడికలపూడి ఎస్సై వల్లి పద్మ సూచించారు. బుధవారం మండలంలోని ఆడమిల్లి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం మరియు మాండలైజ్ కంపెనీ అఫ్రో సంస్థ వారి సంయుక్త ఆధ్వర్యంలో "యువత అభివృద్ధి కార్యక్రమం" నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తడికలపూడి ఎస్ఐకె వల్లీ పద్మ మాట్లాడుతూ యువత రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని తెలియజేయడంతో పాటు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కామవరపుకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ సారధి ప్రసంగిస్తూ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల అభివృద్ధి సెక్రెటరీ శ్రీ జి.కేశవరావు ప్రసంగిస్తూ యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం అఫ్రో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పి.విజయ్ ప్రసాద్ ప్రసంగిస్తూ విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ కలగి ఉండాలని పేర్కొన్నారు

ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ఐక్యూ ఎసికో ఆర్డినేటర్ డాక్టర్ జి శ్రీనివాసరావు, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ వై రాజేష్ తో పాటు అధ్యాపక సిబ్బంది మరియు విద్యా ర్థులు పాల్గొన్నారు.

## మొయినాబాద్ మున్సిపాలిటీకి చెందిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మరియు సీనియర్ అసిస్టెంట్ వలలో చిక్కారు

- అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్



**తెలంగాణ, హైదరాబాద్.30-09-2026:** మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్శ్రీమతి గుండు వాణి, ఫిర్యాదుదారుని నిర్మాణాన్ని అక్రమ నిర్మాణంగా పరిగణించి ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఉండేందుకు గాను, లంచం డిమాండ్ చేసి స్వీకరించారు. ఈ ప్రక్రియలో మొయినాబాద్ గ్రామ పంచాయతీ మాజీ కార్యదర్శి మరియు ప్రస్తుతం మొయినాబాద్ మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న యలమోని సుదర్శన్ ద్వారా రూ. 75,000/- లంచం తీసుకుంటుండగా సిటీ రేంజ్-2 అధికారులు ఆమెను పట్టుకున్నారు. వద్ద ఉన్న రూ. 75,000/- లంచం సొమ్మును అతని సమక్షంలోనే స్వాధీనం చేసుకున్నారు. తద్వారా, నిందితులైన అధికారులు అక్రమ లబ్ధి పొందేందుకు తమ విధులను అక్రమంగా మరియు నిజాయితీ లేకుండా నిర్వహించారు.అందువల్ల, మరియులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని కేసుల గౌరవనీయ అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరుస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి.సెల్ ఫోన్ నంబర్ – 1064 (టోల్ ఫ్రీ నంబర్): ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, చట్టపరమైన చర్యల కోసం ప్రజలు ాజదీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని కోరడమైనది. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ గతంలో ట్విట్టర్ద్వారా కూడా తెలంగాణను సంప్రదించవచ్చు. తెలంగాణను సంప్రదించడానికి వీలుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో యొక్క కోడ్ ప్రదర్శించబడింది. బాధితుడు/ఫిర్యాదుదారుని పేరు మరియు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

## వచ్చే నెల 2న మద్యం, మాంసం దుకాణాలు బంద్.



మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని వచ్చే నెల 2న మద్యం, మాంసం దుకాణాలను బంద్ చేయనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని మాంసం విక్రయశాలలను, మద్యం దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఉత్తర్వులు జారీచేశారు.

అధికారుల ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న గొర్రెలు, మేకలు, పశువుల వధశాలలతోపాటు అన్ని రకాల రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను అక్టోబర్ 2న పూర్తిగా మూసివేయాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ చట్టం-1955 లోని సెక్షన్ 533 (బి) ప్రకారం.. స్టాండింగ్ కమిటీ తీర్మానం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు స్పష్టంచేశారు. విక్రయశాలలను, మద్యం దుకాణాలను మూసివేయాలని.ఈ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు తమ సిబ్బందికి సహకరించాలని.

హైదరాబాద్ పోలీస్ కమిషనర్లను జీహెచ్ఎంసీ కోరింది.

# క్రికెట్‌కు ఐర్లాండ్ ఆల్‌రౌండర్ సిమి సింగ్ వీడ్కోలు..!



ఐర్లాండ్ ఆల్‌రౌండర్ సిమి సింగ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్ నుంచి వలస వెళ్లి ఐరిష్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సిమి.. 39 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ ప్రకటించాడు. రెండేళ్ల క్రితం తీవ్ర అనారగ్యంతో బాధపడిన అతడు.. ఈమధ్యే పూర్తిగా కోలుకున్నాడు. కానీ, కుర్రాళ్ల నుంచి పోటీ ఎక్కువవ్వడం, వయసు పైబడడంతో పునరాగమనం అసాధ్యమని తెలిసి మంగళవారం హఠాత్తుగా ఆటకు అల్విదా చెప్పేశాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఐర్లాండ్ ఆటగాడు సిమి సింగ్ రిటైరయ్యాడు. భారత్ నుంచి 19 ఏళ్ల వయసులో ఆ దేశం వెళ్లిన సిమి.. క్రికెటర్‌గా రాణించాడు. 2017లో అరంగేట్రం చేసిన సిమి.. వీడ్కోలు మ్యాచ్ లేకుండానే తొమ్మిదేళ్ల కెరీర్‌ను ముగించాడు. నాలుగేళ్ల క్రితం టీ20 వరల్డ్‌కప్ ఆడిన ఆ ఆల్‌రౌండర్ 2021లో ఐసీసీ పురుషుల వన్డే జట్టులో చోటు సంపాదించాడు. 29 ఏళ్లకు డెబ్యూ క్యాప్ అందుకొని న్యూజిలాండ్‌పై తొలి మ్యాచ్ ఆడిన సిమి.. ఐర్లాండ్ తరఫున 88 మ్యాచ్(35 వన్డేలు, 53 టీ20లు)లు ఆడాడు. బంతితో రాణించి 83 వికెట్లు తీసిన అతడు 2021లో దక్షిణాఫ్రికా అజేయ శతకం సాధించాడు. ఆ మ్యాచ్‌లో సఫారీలపై ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన వన్డే సెంచరీ బాదిన తొలి ఆటగాడిగా సిమి చరిత్ర సృష్టించాడు. క్రికెట్ కెరీర్ కొనసాగుతున్న సమయంలోనే సిమి సింగ్ అనారోగ్యానికి గురయ్యాడు. 2024లో అతడు కాలేయ మార్పిడి చేయించుకున్నాడు. ఇటీవలే పూర్తిగా కోలుకున్నాడు. ప్రస్తుతం అతడికి 39 ఏళ్లు. దాంతో.. ఇక పునరాగమనం కష్టమే అనుకున్న సిమి వీడ్కోలు ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్ ఆడాలనే కోరికతో నేను 19 ఏళ్ల పిల్లాడిగా ఐర్లాండ్‌కు వచ్చా. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుటే నా ప్రయాణం ఎంతో గొప్పగా అనిపిస్తోంది. నాకు మద్దతిచ్చినందుకు, నాపై నమ్మకం ఉంచినందుకు ఐర్లాండ్ క్రికెట్‌కు ధన్యవాదాలు. నా కుటుంబం ప్రేమ, మద్దతు లేకపోయి ఉంటే ఇదంతా సాధ్యమయ్యేది కాదు అని సిమి పేర్కొన్నాడు.

# ఫైనల్లోకి భారత మహిళల హాకీ జట్టు



ఆసియా క్రీడల్లో జయభేరి మోగిస్తున్న భారత మహిళల హాకీ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశ నుంచి దుమ్మురేపిన టీమిండియా సెమీఫైనల్లో దక్షిణ కొరియాను చిత్తు చేసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. తద్వారా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ పసిడి పోరుకు సిద్ధమైంది భారత్. కీలకమైన ఈ మ్యాచ్‌లో ఇషికా చౌదరీ, కెప్టెన్ సలీమా టెటె చెరో గోల్‌తో రాణించారు. పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు స్వర్ణానికి అడుగు దూరంలో నిలిచింది. తొలి రౌండ్ నుంచి అదరగొట్టిన టీమిండియా బుధవారం సెమీఫైనల్లో దక్షిణా కొరియాను నిలువరించింది. పటిష్టమైన కొరియాపై 2-0తో గెలుపొందిన భారత్.. 44 ఏళ్ల స్వప్నాన్ని సాకారం చేస్తూ ఫైనల్లో అడుగుపెట్టింది. చివరగా 1982లో ఢిల్లీ వేదికగా జరిగిన క్రీడల్లో పసిడి పతకం సాధించింది మహిళల జట్టు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు సలీమా టెటె సారథ్యంలోని భారత బృందం సంచలన ఆటతో ప్రత్యర్థులను మట్టికరిపించింది. బుధవారం దక్షిణ కొరియాపై ఇషికా చౌదరీ 44వ నిమిషంలో.. కెప్టెన్ సలీమ 48వ నిమిషంలో గోల్ చేయగా.. ఉమెన్ ఇన్ సాఫ్రాన్ దర్జాగా ఫైనల్ చేరింది. స్వర్ణం కోసం డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను టీమిండయా ఢీకొట్టనుంది.

# కుల్దీప్ యాదవ్ 'డబుల్ సెంచరీ'



టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో 200 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. అత్యంత వేగంగా ఈ ఘనతను అందుకున్న తొలి భారత స్పిన్నర్‌గా నిలిచాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో షై హోప్, కీమో పాల్‌ను ఔట్ చేయడం ద్వారా ఈ ఘనతను అందుకున్నాడు. 123 వన్డేల్లో 26.70 సగటుతో కుల్దీప్ యాదవ్ 200 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండు సార్లు ఐదు వికెట్ల ఘనత ఉండగా.. 10 సార్లు నాలుగు వికెట్ల ప్రదర్శన చేశాడు. కుల్దీప్ యాదవ్ అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు 6/25గా ఉన్నాయి. మహమ్మద్ షమీ 104 వన్డేల్లో 200 వికెట్ల మైలురాయి అందుకొని అత్యంత వేగంగా ఈ ఘనత సాధించి తొలి భారత బౌలర్‌గా కొనసాగుతున్నాడు. కుల్దీప్ యాదవ్ రెండో స్థానంలో ఉండగా.. అజిత్ అగార్కర్ 133 వన్డేల్లో, జహీర్ ఖాన్ 144 వన్డేల్లో 200 వికెట్ల మార్క్‌ను చేరుకున్నారు. భారత క్రికెట్‌లో ఇప్పటి వరకు 9 మంది బౌలర్లు 200 వికెట్ల మైలురాయి అందుకోగా.. అనిల్ కుంబ్లే 334 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. జవగళ్ శ్రీనాథ్ (315 వికెట్లు), అజిత్ అగార్కర్(288 వికెట్లు), జహీర్ ఖాన్(269 వికెట్లు, హర్భజన్ సింగ్(265 వికెట్లు), కపిల్ దేవ్(253 వికెట్లు), జడేజా(232 వికెట్లు), షమీ(206 వికెట్లు) కుల్దీప్ యాదవ్ కంటే ముందున్నారు.

# టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా?

టీమిండియా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా భారత క్రికెట్ జట్టు తదుపరి చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. అజిత్ అగార్కర్ ఈ పదవి నుంచి వైదొలగడంతో, ప్రస్తుతం సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక హెడ్‌గా ఉన్న 39 ఏళ్ల ఓజానే పూర్తిస్థాయి చీఫ్ సెలెక్టర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం గువాహటిలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో నలుగురు సెలెక్టర్ల కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ఒకరోజు ముందు బర్సపరా స్టేడియంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో ప్రజ్ఞాన్ ఓజాతో పాటు శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్ పాల్గొన్నారు. అయితే, మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఇందులో పాలుపంచుకోలేదు. సాధారణంగా ఒక ద్వైపాక్షిక సిరీస్ సమయంలో సెలెక్షన్ కమిటీ మొత్తం ఇలా సమావేశం కావడం అరుదు కావడంతో, ఓజా నియామకం దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. త్వరలో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ పర్యటనకు భారత జట్లను ఎంపిక చేసే విషయంపైనే ఈ



సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27 వరకు జరగనున్న ఈ సుదీర్ఘ పర్యటనలో భారత్ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. దీంతో పాటు, అక్టోబర్ 24 నుంచి న్యూజిలాండ్‌లో మూడు టెస్టులు ఆడనున్న భారత్ 'ఎ' జట్టును కూడా ఎంపిక చేయాల్సి ఉంది. భారత జట్టు వరుస సిరీస్‌లతో తీరిక లేకుండా ఉండటంతో ఆటగాళ్ల వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కొత్త సెలెక్షన్ కమిటీకి పెద్ద సవాలుగా మారనుంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు కూర్పును సిద్ధం చేసేందుకు కూడా ఈ పర్యటన కీలకం కానుంది. సీనియర్ జట్టు అవసరాలతో పాటు, భారత్ 'ఎ' కార్యక్రమాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ఓజా నేతృత్వంలోని కమిటీ ముందున్న ప్రధాన కర్తవ్యం.

# ఆర్చరీలో చరిత్ర సృష్టించిన సాహిబ్, చికితా జోడీ



ఆసియా క్రీడలు 2026లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఆర్చరీలో నేడు భారత్‌కు స్వర్ణాల పంట పండింది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు ఫైనల్‌లో చైనాను చిత్తు చేసి టైటిల్‌ను నిలబెట్టుకుంది.

ఈ క్రమంలో దక్షిణ కొరియా పేరిట ఉన్న ప్రపంచ రికార్డును కూడా సమం చేసింది. అదే జోరులో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ కూడా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

సాహిబ్ జాదవ్, చికితా తానివర్తి జోడీ స్వర్ణం గెలిచింది. ఈ విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు అర్హత కూడా సాధించి భారత్‌కు రెట్టింపు ఆనందాన్ని అందించింది. ఇతర క్రీడల్లోనూ భారత క్రీడాకారులు సత్తా చాటారు.

మహిళల స్క్వాష్‌లో తన్వి ఖన్నా, అనహత్ సింగ్‌లతో కూడిన జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లి మరో పతకాన్ని ఖాయం చేసింది. అథ్లెటిక్స్ ఈవెంట్లు ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి రెజ్లర్లు, బాక్సర్లు, ఆర్చర్లపైనే ఉంది.

హాకీలో భారత మహిళల జట్టు ఫైనల్‌లో స్థానం కోసం దక్షిణ కొరియాతో తలపడనుంది. స్టార్ జూడోకా అస్మితా దేయ్ కూడా బరిలోకి దిగనుంది. నిన్న మహిళల ట్రాప్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన నీరూ ధండా, నేడు మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్, టీమ్ ఈవెంట్‌లో పోటీపడనుంది.

# వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ చరిత్ర



వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ చరిత్ర సృష్టించింది.

53 ఏళ్ల తమ వన్డే క్రికెట్ చరిత్రలో తొలిసారి 400ం స్కోర్ చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గౌహతి వేదికగా బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ 405/7 స్కోర్ చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించింది. వన్డే క్రికెట్ చరిత్రలోనే వెస్టిండీస్‌కు ఇదే అత్యధిక స్కోర్ కావడం గమనార్హం. జాన్ క్యాంబెల్(68 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101), కెప్టెన్ షై హోప్(94 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 104), అమీర్ జంగూ(77 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 114) శతకాలతో చెలరేగడంతో విండీస్ ఈ భారీ స్కోర్ నమోదు చేసింది. అంతేకాకుండా వెస్టిండీస్ వన్డే క్రికెట్ చరిత్రలోనే ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు శతకాలు సాధించడం కూడా ఇదే తొలిసారి. 2019లో ఇంగ్లండ్‌పై సెయింట్ జార్జ్ వేదికగా చేసిన 389 పరుగులే వెస్టిండీస్‌కు హయ్యెస్ట్ స్కోర్‌గా ఉండగా.. గౌహతి మ్యాచ్‌లో ఈ రికార్డ్‌ను అధిగమించింది. వెస్టిండీస్ బ్యాటర్ల విధ్వంసంతో భారత బౌలర్లు తేలిపోయారు. అరంగేట్ర పేసర్ అకీబ్ నబీ 8.5 ఓవర్లలో 84 పరుగులిచ్చి ఒక్క వికెట్ తీయలేకపోయాడు. గుర్నూర్ బ్రార్ 10 ఓవర్లలో 2 వికెట్లు తీసినప్పటికీ 96 పరుగులు సమర్పించుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ 5 ఓవర్లలోనే 45 పరుగులిచ్చుకోగా.. జడేజా, కుల్దీప్ యాదవ్ పూర్తి కోటా బౌలింగ్ చేసి 75, 65 పరుగులు ఇచ్చుకున్నారు.వన్డేల్లో వెస్టిండీస్ అత్యధిక స్కోర్లు..405/7లి జం భారత్, గౌహతి 2026389 జం ఇంగ్లండ్, సెయింట్ జార్జ్ 2019385/7 జం ఐర్లాండ్, డబ్లిన్ 2025381/3 జం ఐర్లాండ్, డబ్లిన్ 2019374/6 జం నెదర్లాండ్, హరారే 2023 భారత్‌పై అత్యధిక వన్డే స్కోర్లు438/4 సౌతాఫ్రికా, వాంఖడే 2015411/8 శ్రీలంక, రాజ్‌కోట్ 2009405/7 వెస్టిండీస్, గౌహతి 2026లి389/4 ఆస్ట్రేలియా, సిడ్నీ 2020387/3 ఇంగ్లండ్, లార్డ్స్ 2026

### సత్య, యోగి బాబుల సినిమాకు టైటిల్ ఖరారు..

## 'గోల్డెన్ భాగ్యం'!




తెలుగు చిత్రసీమకు చెందిన ప్రముఖ హాస్య నటుడు సత్య, తమిళ స్టార్ కమెడియన్ యోగి బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ద్విభాషా చిత్రానికి టైటిల్ ఖరారైంది. ఈ సినిమాకు 'గోల్డెన్ భాగ్యం' అనే పేరును ఖరారు చేస్తూ చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. పవన్ బసమ్శెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందిస్తున్నారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ రివీల్ గ్లింప్స్ వీడియో ఆకట్టుకుంటోంది. బిర్యానీ, ఇడ్లీలలో ఏది గొప్పదనే అంశంపై తెలుగు, తమిళ వ్యక్తుల మధ్య జరిగే సరదా సంభాషణతో ఈ వీడియో ప్రారంభమవుతుంది. అనంతరం సంప్రదాయ దుస్తుల్లో ఉన్న సత్య, యోగి బాబులను పరిచయం చేశారు. ఈ గ్లింప్స్‌లో సత్య తమిళంలో, యోగి బాబు తెలుగులో సంభాషించడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇది ప్రేమ, నేరం (క్రైమ్), యాక్షన్ కలగలిసిన పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమని మేకర్స్ వెల్లడించారు.డ్రీమ్ మూవీ మేకర్స్, నయవాయు చిత్రాల పతాకాలపై నాగార్జున రెడ్డి, పవన్ బసమ్శెట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జయశ్రీ, అతిరాజ్ కథానాయికలుగా నటిస్తుండగా.. వెన్నెల కిశోర్, సుదర్శన్, కిశోర్ తిరుమల, రోహిణి, తనికెళ్ల భరణి, సునీల్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాబ్లు అజు ఛాయాగ్రహణం అందిస్తుండగా, పవన్ సీహెచ్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

### ముంబై 26/11 దాడుల హీరో కథ..

## ఉత్కంఠ రేపుతున్న 'ప్రహార్' ట్రైలర్

బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ప్రహార్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఉజ్వల్ నికమ్'. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముంబై ఉగ్రదాడుల నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.దేశం గర్వించదగ్గ పబ్లిక్ ప్రాసిక్యూటర్లలో ఒకరైన ఉజ్వల్ నికమ్ జీవిత కథ ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. ముఖ్యంగా 26/11 ముంబై దాడి కేసులో ఉగ్రవాది అజ్మల్ కసబ్‌కు వ్యతిరేకంగా ఆయన చేసిన వాదనలు, కోర్టు రూమ్‌లో జరిగిన నాటకీయ పరిణామాలు, ఆయన వ్యక్తిగత జీవితంలోని కొన్ని అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారు.ఉజ్వల్ నికమ్ పాత్రలో రాజ్ కుమార్ రావు తన అద్భుతమైన నటనతో ఆకట్టుకోనున్నారు. ఈ చిత్రంలో ఆయన సరసన వామికా గబ్బి నటిస్తుండగా.. జైదీప్ అహ్లావత్, సికందర్ ఖేర్ వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అవినాష్ అరుణ్ ధవారే దర్శకత్వం వహిస్తుండగా, మ్యాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 16, 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




## మొత్తం చిత్ర పరిశ్రమను నిందించకూడదు : అమలా పాల్



సినిమాల్లో కొందరు హీరోయిన్లను అభ్యంతరకరంగా చూపించడానికి మొత్తం చిత్ర పరిశ్రమను నిందించడం సరికాదని, అది ఆయా చిత్రాల దర్శకుడు లేదా టీమ్ ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుందని ప్రముఖ నటి అమలా పాల్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని, మహిళా ప్రాధాన్య చిత్రాలు ఎక్కువగా వస్తుండటం శుభపరిణామమని ఆమె పేర్కొన్నారు.కొచ్చిలో జరిగిన 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్ 2026'లో అమలా పాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాది సినిమాల్లో హీరోయిన్ల పాత్రల చిత్రీకరణపై వస్తున్న విమర్శలపై స్పందించారు. "ప్రతి పరిశ్రమ నుంచి మంచి మహిళా ప్రాధాన్య చిత్రాలు వస్తున్నాయి. కాబట్టి మొత్తం పరిశ్రమను నిందించదలుచుకోలేదు. సమస్య ఏదైనా ఉంటే అది ఒక సినిమాకు లేదా దర్శకుడి ఆలోచనా విధానానికే పరిమితమై ఉంటుంది," అని ఆమె వివరించారు.

15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న తాను ఎప్పుడూ మూస పాత్రలకు భిన్నంగా, ప్రత్యేకమైన పాత్రలనే ఎంచుకున్నానని అమలా పాల్ తెలిపారు. ఇందులో భాగంగానే 2019లో 'ఆడై' (తెలుగులో 'ఆమె') లాంటి సాహసోపేతమైన చిత్రంలో నటించానని గుర్తుచేసుకున్నారు. "ఆ సమయంలో నా ఇమేజ్ ఏమవుతుందోనని, అలాంటి పాత్రలే మళ్లీ వస్తాయేమోనని భయపడ్డాను. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అది చాలా ధైర్యమైన నిర్ణయంగా అనిపిస్తోంది. కానీ, ఇప్పుడు నన్ను 'ఆడై' లాంటి సినిమా చేయమంటే బహుశా చేయలేకపోవచ్చు," అని ఆమె స్పష్టం చేశారు. మహిళలు తమ స్థానం కోసం కష్టపడుతున్నారని, రానున్న రోజుల్లో మరింత సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తారక్‌ను 'జెన్‌జీ ఎన్టీఆర్' అన్న రాఘవేంద్రరావు



ఫహద్ ఫాజిల్ హీరోగా నటించిన 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రముఖ దర్శకులు కె. రాఘవేంద్రరావు చేసిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వ్యాఖ్యలకు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ చిరునవ్వుతో ఇచ్చిన హుందా స్పందన అందరినీ ఆకట్టుకుంటోంది.



ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో, శశాంక్ వెన్నెలకంటి దర్శకత్వంలో వస్తున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్ సినిమా అక్టోబర్ 2న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన వేడుకకు జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు తన ప్రసంగాన్ని 'జై ఎన్టీఆర్' అనే నినాదంతో ప్రారంభించి అందరిలో ఉత్సాహం నింపారు.వెంటనే స్పందిస్తూ, "జై ఎన్టీఆర్ అంటే ఇక్కడ కూర్చున్న అబ్బాయి కాదు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు" అని స్పష్టం చేశారు. "ఆయన సీనియర్ ఎన్టీఆర్. ఆయన తనయుడు హరికృష్ణ. ఆయన కుమారుడు ఇక్కడున్న మన జూనియర్ ఎన్టీఆర్. ఈయన జెన్‌జీ ఎన్టీఆర్" అని చమత్కరించారు.రాఘవేంద్రరావు వ్యాఖ్యలకు జూనియర్ ఎన్టీఆర్ వేదికపై చిరునవ్వుతో కనిపించగా, పక్కనే ఉన్న రాజమౌళి కూడా నవ్వారు. ముఖ్యంగా సీనియర్ ఎన్టీఆర్ పేరు ప్రస్తావించినప్పుడు తారక్ చూపిన గౌరవం, ప్రశాంతమైన స్పందనను అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసిస్తున్నారు. ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## పట్టు వదలని నాని..



ప్యారడైజ్'కు రిలీజ్ రోజు నుంచే మిక్స్‌డ్ టాక్ వచ్చింది. ఈ విషయాన్ని నాని కూడా దాచిపెట్టలేదు. సినిమా అందరికీ ఒకేలా కనెక్ట్ కాలేదని ఆయన ఓపెన్‌గానే మాట్లాడారు. సాధారణంగా ఇలాంటి టాక్ వచ్చిన తర్వాత హీరోలు ప్రమోషన్స్ తగ్గించి నెక్ట్స్ పనుల్లోకి వెళ్లిపోతారు. కానీ నాని మాత్రం అలా చేయడం లేదు. సినిమా థియేటర్లలో ఉన్నంత వరకు తనవంతుగా ఎంత చేయాలో అంత చేయాలనే మూడ్‌లో కనిపిస్తున్నారు. తెలంగాణలో ప్రమోషన్స్ చేసిన తర్వాత ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ వరుసగా తిరుగుతున్నారు. విజయవాడలో కనకదుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకోవడంతో పాటు, ఒంగోలులోని థియేటర్‌కు వెళ్లి ఆడియన్స్‌ను కలవనున్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వచ్చిన విజువల్స్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అంటే సినిమా మీద టాక్ ఎలా ఉన్నా, పబ్లిక్‌లో 'ది ప్యారడైజ్' పేరు తగ్గకుండా చూసే ప్రయత్నం మాత్రం నాని వైపు నుంచి గట్టిగానే జరుగుతోంది. మొదటి వీకెండ్ వరకు కలెక్షన్స్ కూడా పూర్తిగా పడిపోలేదు. ఓపెనింగ్స్‌కు నాని మార్కెట్, భారీ ప్రమోషన్, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ బాగా ఉపయోగపడ్డాయి. అయితే వీకెండ్ తర్వాతే అసలు లెక్క మొదలవుతుంది. మిక్స్‌డ్ టాక్ ఉన్న సినిమాలకు సోమవారం నుంచి డ్రాప్స్ ఎలా ఉంటాయన్నదే కీలకం. అందుకే ఇప్పుడు టీమ్ కూడా ప్రమోషన్స్‌ను ఆపకుండా మరోసారి ఆడియన్స్‌ను థియేటర్ల వైపు తిప్పే ప్రయత్నం చేస్తోంది. దీనికి గాంధీ జయంతి కూడా కలిసి వస్తోంది. మధ్యలో హాలిడే ఉండటం, వెంటనే మరో వీకెండ్ రావడం 'ది ప్యారడైజ్'కు రెండో ఛాన్స్‌లా మారొచ్చు. మొదటి వీకెండ్‌లో చూడని ఆడియన్స్‌ను ఈ గ్యాప్‌లో థియేటర్లకు రప్పించగలిగితే కలెక్షన్స్ ఇంకొన్ని రోజులు నిలబడే అవకాశం ఉంటుంది. అందుకే నాని ఈ టైమ్‌లోనే ఆంధ్రా టూర్ పెట్టుకోవడం కూడా ప్లాన్డ్ మూవ్‌లానే కనిపిస్తోంది.

## బడ్జెట్ 30 కోట్ల లోపు .. వసూళ్లు 300 కోట్లకి పైన ..

### ఓటీటీకి మలయాళ మూవీ!

చాలా తక్కువ బడ్జెట్ లో రూపొందడం .. భారీ వసూళ్లను ఖాతాలో వేసుకోవడం మలయాళ సినిమాల విషయంలో జరుగుతూనే ఉంటుంది. క్రితం ఏడాదిలోను .. ఈ ఏడాది ఆరంభంలోను మలయాళంలో చిన్న సినిమాలు వసూళ్ల పరంగా కొత్త రికార్డులను సృష్టించాయి. మలయాళంతో పాటు ఇతర భాషల్లోను ఈ సినిమాలు భారీ విజయాలను నమోదు చేయడం విశేషం. అలాంటి సినిమాల జాబితాలో తాజాగా 'బెత్లెహెం కుటుంబ యూనిట్' సినిమా కనిపిస్తుంది. నివిన్ పౌలి – మమితా బైజు ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఆగస్టు 21వ తేదీన థియేటర్లకు వచ్చింది. టైటిల్ ను మార్చకుండా ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేయడం కూడా విశేషంగా చెప్పుకోవచ్చు. అయినా తెలుగు వైపు నుంచి కూడా ఈ సినిమాకి మంచి ఆదరణ లభించింది. దాదాపు 25 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మించారు. అలాంటి ఈ సినిమా 325 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. ఒక చిన్న టౌన్ నేపథ్యంలో నడిచే సింపుల్ లవ్ స్టోరీ ఈ స్థాయి వసూళ్లు రావడం నిజంగా గొప్ప విషయమే.ఈ సినిమాలో హీరోకి పెళ్లీడు దాటిపోతుంది. అతను ఇక పెళ్లి విషయాన్ని పక్కన పెట్టేసి కేటరింగ్ బిజినెస్ చూసుకుంటూ ఉంటాడు. అలాంటి పరిస్థితులలో కొత్తగా ఆ ఊరు వచ్చిన హీరోయిన్ కి ఆయన కేరక్టర్ నచ్చుతుంది. తనకంటే అతను వయసులో చాలా పెద్దవాడైనప్పటికీ లవ్ చేయడం మొదలుపెడుతుంది. ఆ విషయం ఆమె ఇంట్లో తెలుస్తుంది. అప్పుడు ఏం జరుగుతుంది? అనేది కథ. అక్టోబర్ 2వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో అందుబాటులోకి వస్తున్న ఈ సినిమాకి, ఓటీటీ వైపు నుంచి ఏ స్థాయి ఆదరణ లభిస్తుందనేది చూడాలి.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com